ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
భద్రాద్రి కొత్తగూడెం
BHADRADRI KOTHAGUDEM
శుక్రవారం, 13 సెప్టెంబరు 2024
5

## పకడ్బందీగా గణేశ్ నిమజ్జనోత్సవం



- భారీ బందోబస్తు ఏర్పాట్లు చేయాలి
- ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి
- 16న మద్యం షాపుల బంద్
- పోలీసు అధికారులతో సీపీ సునీల్‌దత్

6

# ఉద్యమాలకు స్ఫూర్తినిచ్చిన నేత

## ఉమ్మడి ఖమ్మం జిల్లాతో సీతారాం ఏచూరికి 40 ఏళ్ల అనుబంధం



- సీపీఎం జిల్లా శాఖ సభలు, సమావేశాలకు అనేసార్లు హాజరు
- చివరిసారిగా గతేడాది నవంబరులో ఖమ్మం రాక
- ఇక్కడి నేతలతో వ్యక్తిగత అనుబంధాలు
- అగ్రనేత మృతితో విషాదంలో పార్టీ శ్రేణులు
- సంతాపం తెలిపిన పలువురు ప్రముఖులు

6




2023 నవంబరులో ఖమ్మంలో సెమినార్‌లో ప్రసంగిస్తూ...

అనారోగ్యంతో కన్నుమూసిన సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి ఖమ్మం జిల్లాతో సుమారు 40 ఏళ్లుగా అనుబంధం ఉంది. సీపీఎం మహాసభలకు, రైతాంగ, కార్మిక ఆందోళనలు, ఉద్యమాలకు అతిథిగా హాజరై పార్టీ బలోపేతానికి కృషిచేశారు. 1985 నుంచి ఆయా ఎన్నికల్లో సీపీఎం జాతీయ నేతగా అనేక సభలు, సమావేశాలు, ప్రచార కార్యక్రమాల్లో పాలు పంచుకున్నారు. సీపీఎం జిల్లా నేతలతోనూ ఆయనకు ప్రత్యేకమైన అనుబంధం ఉంది. ఉమ్మడి జిల్లా నేతలు ఆహ్వానించిన ప్రతీసారి పార్టీ కార్యక్రమాలకు పెద్దన్నగా దశ దిశ నిర్దేశించారు.



2002 డిసెంబరు 19న భద్రాచలంలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న సీతారాం ఏచూరి

### ఏచూరి మృతి దేశానికి తీవ్ర నష్టం




**తమ్మినేని వీరభద్రం, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి**

సంపన్న కుటుంబంలో పుట్టినా వామపక్ష భావాల వైపు ఆకర్షితుడై ప్రజాతంత్ర ఉద్యమాలను నిర్మించటంలో సీతారాం ఏచూరి కీలకపాత్ర పోషించారు. 1985లో సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడిగా ఎన్నికై, అంతర్జాతీయ కమ్యూనిస్టు సంబంధాల విభాగాలకు నేతృత్వం వహించారు. వియత్నాం, చైనా, రష్యాలలో కమ్యూనిస్టు ఉద్యమవ్యాప్తికి సైద్ధాంతిక చర్చలు జరిపారు. వచ్చే ఏడాది ఏప్రిల్‌లో తమిళనాడులో పార్టీ జాతీయ మహాసభల్లో కీలక నివేదికను ప్రవేశపెట్టవలసిన తరుణంలో ఆయన మరణించడం తీవ్ర విషాదం. మతోన్మాదం పెచ్చరిల్లుతున్న తరుణంలో ఆయన మృతి దేశానికి తీవ్రనష్టాన్ని కలిగిస్తుంది.

\- ఖమ్మం టౌన్

### కమ్యూనిస్టు ఉద్యమాలకు తీరని లోటు



**కూనంనేని సాంబశివరావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి**

విద్యావేత్తగా ఉన్న సీతారాం ఏచూరి సీపీఎంలో చేరి క్రియాశీల పాత్ర పోషించారు. అనేక ప్రజా, కార్మికోద్యమాలకు నాయకత్వం వహించి, దేశంలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. సీపీఎం అనుబంధ ప్రజాసంఘాల్లో ఎన్నో పదవులు చేపట్టి అంచెలంచెలుగా దేశ నాయకుడిగా ఎదిగారు. బలమైన రాజకీయ నాయకున్ని దేశం కోల్పోయింది. ఆయన మరణం కమ్యూనిస్టు ఉద్యమాలకు తీరని లోటు.

\-ఆంధ్రజోతి, కొత్తగూడెం



# వరద బాధితులకు ప్రభుత్వం అండ

- స్వచ్ఛంద సంస్థలు ముందుకురావడం హర్షణీయం : మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- మార్కెట్ దడవాయిలు, ఆటో డ్రైవర్లకు నిత్యావసర సరుకుల పంపిణీ

6

ధ్రువపత్రాల జారీకి

## క్యాంపులు భేష్..

- ప్రశంసించిన ఎమ్మెల్సీ కోదండరాం
- యాకూబ్ పిల్లలకు ఓదార్పు.. అశ్విని కుటుంబానికి పరామర్శ

టీజేఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ కోదండరాం గురువారం జిల్లాలో పర్యటించారు. ఖమ్మం నగరంలోని నయాబజార్ కాలేజీలో ఏర్పాటు చేసిన వరద బాధితుల ధ్రువీకరణ పత్రాల క్యాంపును పరిశీలించారు. బాధితులకు టీజేఎస్ తరపున నిత్యావసరాలు పంపిణీ చేశారు. అలాగే కూసుమంచి మండలం నాయకన్‌గూడెంలో తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలను పరామర్శించారు. కారేపల్లి మండలం గంగారాం తండాలో మోతీలాల్, అశ్విని కుటుంబాన్ని ఓదార్చారు.

6



తడిసిన రికార్డులను పరిశీలిస్తున్న కోదండరాం

ఖమ్మం సంక్షేమ విభాగం, సెప్టెంబరు 12: భారీ వర్షాలతో ఈ నెల 1న వరద తాకిడికి గురైన ఖమ్మంలోని మున్నేరు పరివాహక ప్రాంతంలో గురువారం కేంద్ర బృందం సభ్యులు పర్యటించారు. ఉదయం 8.15 గంటలకు జాతీయ విపత్తు మెనేజ్‌మెంట్ అథారిటీ(ఎన్‌డీఎంఏ) కమిషనర్ కేపీ సింగ్‌తో పాటు డిప్యూటీ డైరెక్టర్ మహేశ్‌కుమార్, జాయింట్ డైరెక్టర్ శాంతినాథ్‌శివప్ప, కేఎస్ కుశలవ ఎస్‌ఈ, నియాక్‌హొనసన్, శశ్వేందర్‌రెడ్డిలు ఖమ్మం కాల్వొడ్డుకు చేరుకున్నారు. కాల్వొడ్డు బొక్కలగడ్డ నుంచి నయాబజార్ కాలేజీ, ప్రకాశ్‌నగర్, మోతీనగర్ వరకు రెండు గంటల పాటు పర్యటన కొనసాగింది. కాల్వొడ్డుకు రాగానే అక్కడ వరద నీటితో ధ్వంసమైన నివాసాలను కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ స్వయంగా కేంద్ర బృందానికి చూపించారు. అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఓ బాధితురాలు కేంద్ర బృందం వద్దకు వచ్చి దండం పెట్టి తన ఇల్లు కొట్టుకుపోయిందని ఆవేదన వ్యక్తం చేయగా, ఆమె ఆవేదనను కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ హిందీలో కేంద్ర బృందానికి వివరించారు. అక్కడ నుంచి నయాబజార్ కాలేజీకి వెళ్లి ధ్వంసమైన ప్రహరీని పరిశీలించారు. తర్వాత ప్రకాశ్‌నగర్‌కు చేరుకొని అక్కడ వంతెనను పరిశీలించి, ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. మోతీనగర్‌కు చేరుకొని మున్నేరు పరివాహక ప్రాంతంలో ఏ మేరకు వరద వచ్చింది అనే విషయాన్ని పరిశీలించారు.

కాగా, కేంద్ర బృందం పర్యటనను కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, కమిషనర్ అభిషేక్ అగస్త్య, అసిస్టెంట్ కమిషనర్ మ్రిణాల్ సద్వినియోగం చేసుకున్నారు. కాల్వొడ్డుకు కేంద్ర బృందం రాగానే కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మున్నేరు ముంపు ప్రభావాన్ని ఫొటో ఎగ్జిబిషన్ ద్వారా చూపించారు. వెను వెంటనే కమిషనర్ అభిషేక్ అగస్త్య తన ల్యాప్‌టాప్‌లోని 8 నిమిషాల నిడివి గల రెండు వీడియో చిత్రాలను కేంద్ర బృందానికి చూపించారు. అసిస్టెంట్ కమిషనర్ మ్రిణాల్ కూడా బాధితులకు పునరావాసం కల్పించిన తీరుపై వివరించారు. ఈ సందర్భంగా కేంద్ర బృందం సభ్యులు తిరిగి వెళ్లే సమయంలో మోతీనగర్ వద్ద కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌తో మాట్లాడుతూ అధికారులు చేపట్టిన పునరావాసం, పారిశుధ్యం, బాధితుల గుర్తింపు బాగుందని మెచ్చుకున్నారు..

### వరద బాధితుల నిరాశ

మొదటి బృందంలో ముగ్గురు, రెండో బృందంలో ముగ్గురు చొప్పున వచ్చిన కేంద్ర బృందం సభ్యులు విడివిడిగా పర్యటించకుండా ఒకే బృందంగా రెండు వాహనాల్లో మున్నేరు ముంపు ప్రాంతాలను పరిశీలించారు. అయితే కాల్వొడ్డు నుంచి ప్రతీ చోట బాధితులు తమ గోడును కేంద్ర బృందానికి తెలిపేందుకు ప్రయత్నించారు. కానీ అవకాశం దొరకలేదు. కాల్వొడ్డులో ఓ బాధితురాలు తన ఇల్లు పూర్తిగా ధ్వంసమైందని కేంద్ర బృందానికి దండం పెట్టి వేడుకుంది. తర్వాత మోతీనగర్‌లో బీజేపీ, సీపీఎం నాయకులు విడి విడిగా ఎన్‌డీఎంఏ కమిషనర్ కేపీ సింగ్‌కు వినతి పత్రాలను అందించారు. ఈ సందర్భంగా పదుల సంఖ్యలో మహిళలు తమ ఆధార్ కార్డులను పట్టుకొని కేంద్ర బృందం పర్యటన ప్రాంతానికి చేరుకున్నారు. తమ నివాసాలను ఒక్కసారి చూడాలని కోరారు. పెద్దఎత్తున కేంద్ర బృందం వాహనాల వద్దకు చేరుకున్నారు. కానీ బృందం సభ్యులు బాధితులతో మాట్లాడలేదు. దీంతో మోతీనగర్‌లో మహిళలు కేంద్ర బృందం కారును చుట్టుముట్టారు. పోలీసుల సహాయంతో బృందం సభ్యులు అక్కడ నుంచి వెళ్లిపోయారు.



కేంద్ర బృందం ప్రతినిధికి దండం పెడుతున్న బాధితురాలు



మున్నేరు వరద విధ్వంస దృశ్యాలను కేంద్ర బృందానికి ల్యాప్‌టాప్‌లో చూపుతున్న కలెక్టర్, కమిషనర్

# పరిశీలిస్తూ... ఆలకిస్తూ...

## వరద నష్టంపై నగరంలో కేంద్ర బృందం పర్యటన

- మున్నేరు విధ్వంసాన్ని ప్రత్యక్షంగా పరిశీలించిన సభ్యులు
- కాల్వొడ్డు నుంచి మోతీనగర్ వరకు సాగిన పర్యటన
- నష్ట తీవ్రతను కళ్లకు కట్టిన ముగ్గురు ఐఏఎస్‌లు
- తమ గోడును వినకపోవడంతో బాధితుల అసంతృప్తి
- అధికారుల పనితీరుకు కితాబునిచ్చిన కేంద్ర బృందం

## వరద నష్టంపై కలెక్టర్ నివేదిక

- ముగిసిన కేంద్ర బృందం పర్యటన
- ఆర్థిక సహాయంపై ఆశలు

6

# జాతీయ విపత్తుగా గుర్తించాలి

- కేంద్రం తక్షణమే రూ.10వేల కోట్లు విడుదల చేయాలి..
- ధరలకు అనుగుణంగా పరిహారం ఇవ్వాలి...
- దెబ్బతిన్న పంటలకు రూ.30వేలు, ఇళ్లకు రూ. 50వేలు చెల్లించాలి..
- కొత్తగూడెం కలెక్టరేట్ ధర్నాలో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



కొత్తగూడెం కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నాను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని

కొత్తగూడెం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఇటీవల వచ్చిన వర్షాలకు పెద్ద ఎత్తున వరదలు వచ్చాయని, ఆ వరదల ధాటికి రాష్ట్ర వ్యాప్తంగా భారీ నష్టం సంభవించిందని ప్రధానంగా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కనీవిని ఎరుగని నష్టం జరిగిందని, ఈ విపత్కర పరిస్థితిని కేంద్ర ప్రభుత్వం జాతీయ విపత్తుగా ప్రకటించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. గురువారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్ ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వర్షాలు, వరదల కారణంగా ఎంతో ఇబ్బంది ఎదురైందని, ఈ ప్రకృతి విపత్తుకు గురైన ప్రజలను ఆదుకునేందుకు కేంద్రం తక్షణమే రూ.10వేల కోట్లను విడుదల చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేయాల్సిన సహాయం చేస్తూనే ఉందని, నష్టాన్ని ప్రాథమికంగా అంచనా వేసినప్పుడు రూ.5644 కోట్లుగా తేలిందని, ఆ తర్వాత క్షేత్ర స్థాయి పర్యటన లెక్కల ప్రకారం నష్టం రూ.6వేల కోట్లుగా తేలిందని, ఈ మొత్తాన్ని కేంద్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లాలో మానేరు, మున్నేరు కారణంగా ప్రజలు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇక భద్రాద్రి జిల్లాలో కిన్నెరసాని ప్రభావంతో పాల్వంచ మండల పరిధిలోని పలు గ్రామాలు నీట మునిగాయని, ఇళ్లు, గోడలు, గోడౌన్లు కొట్టుకుపోయాయన్నారు. పేద ప్రజలు కావడంతో ఇప్పుడు వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, రైతులు వేసిన పంటలు కూడా దెబ్బతిన్నాయని, రోడ్లు, కల్వర్టులు కొట్టుకుపోయి రాకపోకలు నిలిచిపోయాయన్నారు. సీపీఐ ఆధ్వర్యంలో వారిని తక్షణమే ఆదుకునేందుకు నిత్యావసరాలు పంపిణీ చేసినట్లు గుర్తుచేశారు.

రాష్ట్ర ప్రభుత్వం ఎకరాకు పంట నష్టానికి రూ.10వేలు, ఇళ్ల నష్టానికి రూ.16,500 ఇస్తోందని, ప్రస్తుత ధరల ప్రకారం పరిహారం అందించాలని, కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసి ఎకరాకు రూ.30వేలు, ఇళ్లకు రూ.50వేలు ఇవ్వాలని, వరదల్లో చిక్కుకుని ప్రాణాలు కోల్పోయిన వారికి రూ.10లక్షల నష్టపరిహారాన్ని ఇవ్వాలన్నారు. బాధితులకు పక్కా గృహాలు మంజూరు చేయాలని, కిన్నెరసాని పరివాహక ప్రాంత ప్రజలకు వరదల నుంచి శాశ్వత పరిష్కారం చూపాలని, పెరిగిన నిత్యావసర ధరను తగ్గించాలని, అర్హులందరికీ రేషన్‌కార్డులు ఇవ్వాలని, దరఖాస్తు దారులందరికి సంక్షేమ పథకాలు మంజూరు చేయాలన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అదనపు కలెక్టర్ వేణుగోపాల్‌రావుకు సీపీఐ ప్రతినిధి బృందం అందజేశారు. ఈ ధర్నాకు జిల్లా నలుమూలల నుంచి వేలాది మంది కార్యకర్తలు, సానుభూతి పరులు హాజరయ్యారు.

ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే.సాబీర్ పాషా, జిల్లా కార్యవర్గసభ్యులు ముత్యాల విశ్వనాథం, కల్లూరి వెంకటేశ్వరరావు, సరెడ్డి పుల్లారెడ్డి, కే.సారయ్య, నరాటి ప్రసాద్, చంద్రగిరి శ్రీనివాస్, మున్నా లక్ష్మీకుమారి, సలీం, ఎల్లయ్య, సలిగంటి శ్రీనివాస్, ఏపూరి బ్రహ్మం, వెంకటేశ్వరరావు, దస్రు, రాంచందర్, సుధాకర్, రమేష్, మల్లిఖార్జునరావు, ఉప్పుశెట్టి రాహుల్, బండి నాగేశ్వరరావు, నాగుల్ మీరా, భూక్యా శ్రీనివాస్, పేరాల శ్రీను, జక్కుల రాములు, కొమారి హనుమంతరావు, మాచర్ల శ్రీనివాస్, యూసుఫ్, ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

# వరద నష్టంపై కలెక్టర్ నివేదిక

- ముగిసిన కేంద్ర బృందం పర్యటన
- ఆర్థిక సహాయంపై ఆశలు

ఖమ్మం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో కురిసిన భారీవర్షాలు... వరదతతో మున్నేరు, పాలేరు ఆకేరు ఏరుల నుండి పొంగిన వరద....తద్వారా జరిగిన నష్టంపై జిల్లలో జరిగిన భారీనష్టాన్ని కేంద్ర బృందం రెండు రోజులపాటు పర్యటించి వెళ్లింది. బుదవారం పాలేరు నియోజకవర్గంలోని కూసుమంచి, ఖమ్మంరూరల్, తిరుమలాయపాలెం మండలాల్లో పర్యటించగా, గురువారం ఖమ్మంరూరల్, మండలంతోపాట ఖమ్మం నగరం పరిధిలో వరదల కు కోల్పోయిన ఇళ్లను, ముంపుకు గురైన ఇళ్లను, జరిగిన ఆస్తినష్టాన్ని కేంద్ర బృందం అధికారులు ప్రత్యక్షంగా తిలకించారు.

జాతీయ విపత్తు నిర్వాహణ సంస్థ అడ్వయిజర్ కల్నల్ కేపీ సింగ్ అధికారులకు, బాదితులకు భరోసా ఇచ్చారు.. గురువారం ఉదయం జాతీయ విపత్తు నిర్వాహణ సంస్థ అడ్వయిజర్ కల్నల్ కేపీ సింగ్ నేతృత్వంలో మహేష్‌కుమార్, శాంతినాద్ శివప్ప, ఎస్‌కే కుశ్వాహా, టి. నియాల్కిహాన్సన్, డాక్టర్ శ్రీశివర్ధన్‌రెడ్డి జిల్లా పర్యటనకు రాగా రాష్ట్ర భూగర్భ, ఖనిజశాఖ కార్యదర్శి సురేంద్రమోహన్, జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, అదనపు కలెక్టర్ మదుసూదన్‌నాయక్, ఖమ్మంకార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య తో పాటు జిల్లా అధికారుల బృందం కేంద్ర బృందాన్నిసమన్వయం చేస్తూ పర్యటనలో పాలుపంచుకుంది.

జిల్లాలో జరిగిన వరద నష్టాన్ని జిల్లా కలెక్టర్ ఫోటో ఎగ్జిబిషన్ ద్వారా నివేదికల ద్వారా వీడియో రికార్డులను సైతం కేంద్ర బృందానికి అందించారు. మరోవైపు వరదబాదితులు, రైతులు తమగోడు ద్వారా జరిగిన నష్టం వివరించారు. కేంద్ర బృందం తిరుగు ప్రయాణంలో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ శాఖల వారీగా నివేదికతో పాటు ఫోటో ఆల్బమ్, వీడియో పుటేజీలను అందించారు. జిల్లాలో మొత్తం రూ.729.68కోట్ల నష్టం జరిగిందని, ఆరుగురు మృతి చెందారని, మొత్తం 15,258 ఇళ్లు వరద ముంపునకు గురికాగా, 150 ఇళ్లు కొట్టుకుపోయాయని, కలెక్టర్ నివేదిక అదించారు. అలాగే జిల్లాలో పశువులు, కోళ్లు 77821 చనిపోగా, కోటి40 లక్షల ఆస్తి నష్టం జరిగిందని, ఆర్అండ్‌బీకి రోడ్లు, కల్వర్టులు దెబ్బతినడం పలుచోట్ల గండ్లు పడడంతో రూ151.69 కోట్లు, పంచాయతీరాజ్‌శాఖకు రూ.34.77కోట్లు నష్టం జరిగిందని, అలాగే నీటిపారుదలశాఖకు కాలవలు గండ్లు పడడం దెబ్బ తినడంతో రూ.434.07 కోట్లు నష్టం వాటిల్లిందని, పాఠశాల భవనాలు, ఆసుపత్రులు, విద్యుత్‌శాఖకు సుమారు రూ. 9.23కోట్లు నష్టం వాటిల్లిందని తెలిపారు. జిల్లాలో 46374 మంది రైతులకు సంబంధించి 68,345 ఎకరాలలో రూ. 68.34కోట్లు పంటల నష్టం జరిగిందని, వివరించారు. మత్స్య శాఖకు చెరువులు గండ్లు పడడం, సంపద కోల్పవడం ద్వారా రూ.4.44కోట్లు నష్టం జరిగిందని నివేదిక అందించారు. ఈనివేదికను తీసుకున్న కేంద్ర బృందం వావస్తవ పరిస్థితిని గ్రహించింది. ఈనివేదికపై కేంద్రం ప్రకటించనున్న ఆర్థిక సహకారంపైనే అందరి ఆశలు ముడిపడి ఉన్నాయి.

# కొనసాగుతున్న పునరావాస చర్యలు

- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మం కలెక్టరేట్, సెప్టెంబరు12: వరద ముంపు ప్రాంతాల ప్రజలకు సహాయ, పునరావాస చర్యలు వేగంగా చేపట్టినట్లు కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. బుధవా రం విలేకరులతో మాట్లాడుతూ ఖమ్మం నగరపాలక సంస్థ పరిధిలో ఇటీవల భారీ వర్షాలు, వరదల కారణంగా పలు డివిజన్లలో నష్టం వాటిల్లిందన్నారు. ఈ డివిజన్లలో 14 బృందాలను ఏర్పాటు చేసి, 9,292 కుటుంబాల సర్వే చేపట్టి, డాటా ఎంట్రీ పూర్తి చేసినట్లు తెలిపారు. నగరపాలక సంస్థ పరిధిలో స్వర్ణభారతి ఫంక్షన్ హాల్, ధ్వంసలాపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, రామన్నపేట ప్రభు త్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ మహిళా కళాశాల, జూబ్లీక్లబ్ మొత్తం 5 చోట్ల రిలీఫ్ క్యాంపులు ఏర్పాటు చేసి, 7,700 మందిని అక్కడకు తరలించినట్లు పేర్కొన్నారు. వారికి వసతితో పాటు, 9 రోజులపాటు భోజనం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.. 13 వైద్య శిబిరాల ఏర్పాటు చేసి ఫీవర్ సర్వే చేపట్టామన్నారు. ప్రతి పునరావాస కేంద్రంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశామన్నారు. ఉచిత వైద్య సేవలు, మందుల పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. 28 వేల నిత్యావసర వస్తువులు, బ్లాంకెట్లు, దుస్తు లు ముంపు బాధితులకు పంపిణీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. 14 బృం దాలు ఏర్పాటు చేసి, దె బ్బతిన్న ఇండ్ల సర్వే చేపట్టామన్నారు. 980 పారిశుధ్య కార్మికులను ప్రభావిత ప్రాంతాల్లో పారిశుధ్య పనులకు ఏర్పాటుచేశామన్నారు. ఖమ్మం నగరపాలక సంస్థ నుంచి 650, గ్రేటర్ వరంగల్ నుంచి 150, నల్గొండ నుంచి 50, వివిధ గ్రామ పంచాయతీల నుంచి 130 మంది ఇందులో ఉన్నారన్నారు. 37 ఎక్స్‌కవేటర్లు, 60 ట్రాక్టర్లు, 59 వాటర్ ట్యాంకర్లు, 30 స్వచ్ఛ ఆ టోలు పారిశుధ్య పనులకు వినియోగించినట్లు కలెక్టర్ అన్నారు. ఫైర్ ఇంజన్ల ద్వారా రోడ్లు, ఇండ్లలోని బురద తొలగింపు ప్రక్రియ చేపట్టామన్నారు. తాగునీటి సరఫరా పునరుద్ధరణ వేగంగా పూర్తి చేశామన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

వరదల కారణంగా దానవాయిగూడెం ఎంఎల్టీ దెబ్బతిని పనిచేయకపోవడంతో, ప్రత్యామ్నాయ ఏర్పాట్లుగా 559 బోర్ వెల్స్, 78 పవర్ బోర్లు, 9 నగరపాలక సంస్థ సొంత, 13 అద్దె, 40 గ్రామ పంచాయతీల నుంచి వచ్చిన వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేపట్టామన్నారు. సీజనల్ వ్యాధుల నియంత్రణ కోసం బ్లీచింగ్ చల్లడం, కీమోఫాస్ స్ప్రే చేయ డం, నీటి నిల్వల వద్ద ఆయిల్ బాల్స్ వెదజల్లడం చేస్తున్నట్లు ఆయన అన్నారు. ముంపు ప్రాంతాల్లో వరదల కారణంగా సర్టిఫికెట్లు, విలువైన పత్రాలు కోల్పోయిన వారికి అందజేయుటకు 8 ప్రత్యేక శిబిరాలు ఏర్పాటుచేసి, సర్టిఫికెట్లు కోల్పోయిన వారినుండి దరఖాస్తుల స్వీకరిస్తోన్నట్లు తెలిపారు. వారం రోజుల పాటు దరఖాస్తులు స్వీకరించి, రెండోవారంలో సబంధిత శాఖలచే సర్టిఫికెట్ల జారీకి చర్యలు చేపట్టనున్నట్లు ఆయన అన్నారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను పాటిస్తూ, ప్రజలు జాగ్రత్తలు తీసుకొని, ప్రభుత్వ యంత్రాంగానికి సహకరించాలని కలెక్టర్ కోరారు.

# సాధారణస్థితికి గోదావరి

- మొదటి ప్రమాద హెచ్చరిక ఉపసంహరణ



భద్రాచలం వద్ద గోదావరి

భద్రాచలం, సెప్టెంబరు 12: భద్రాచలం వద్ద గత రెండు రోజులుగా ఉధృతంగా ప్రవహించిన గోదావరి క్రమక్రమంగా తగ్గుతూ సాధారణ స్థితికి చేరుకుంటోంది. బుధవారం అర్ధరాత్రి 12గంటలకు 46.6 అడుగులున్న గోదావరి నీటిమట్టం గురువారం ఉదయం 6 గంటలకు 44.3 అడుగులకు తగ్గింది. ఉదయం 9 గంటలకు 43.3, 10.15 గంటలకు 42.9 అడుగులకు తగ్గడంతో మొదటి ప్రమాద హెచ్చరికను భద్రాచలం ఆర్డీవో దామోదర్‌రావు ఉపసంహరించారు. కాగా మధ్యాహ్నం 12 గంటలకు 42.5 అడుగులకు తగ్గిన గోదావరి నీటి మట్టం మధ్యాహ్నం 3గంటలకు 41.9, రాత్రి 11 గంటలకు 41అడుగులకు తగ్గింది. గురువారం అర్ధరాత్రి వరకు గోదావరి నీటిమట్టం తగ్గుతూ వచ్చి అనంతరం నిలకడగా ఉండి శుక్రవారం ఉదయం నుంచి స్వల్పంగా పెరగనుందని కేంద్ర జలసంఘం వర్గాలు పేర్కొంటున్నాయి. ఇదిలా ఉండగా భద్రాచలం గోదావరి కరకట్ట కింది భాగంలో ఉన్న దేవస్థానం కల్యాణ కట్ట నుంచి వరద నీరు తొలగింది.

# ద్విచక్ర వాహనాల దొంగ అరెస్టు

-మూడు ద్విచక్రవాహనాలు స్వాధీనం

దమ్మపేట, సెప్టెంబరు12 : జలసాల కోసం అలవాటు పడి డబ్బుల కోసం ద్విచక్రవాహనాల చోరీకి పాల్పడుతున్న వ్యక్తిని దమ్మపేట పోలీసులు గురువారం అరెస్టు చేసారు. ఈఘటనకు సంబంధించి ఎస్సై సాయికిషోర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం దమ్మపేటకు చెందిన గోలి నాగరాజు మండలంలో వివిధ గ్రామాలలో తిరుగతూ ద్విచక్ర వాహనాలు చోరీ చేసి వాటిని తాకట్టుపెట్టి వచ్చిన డబ్బుతో జల్సాలు చేస్తున్నాడు. దొంగతనాలకు పాల్పడుతున్న నాగురాజును దమ్మపేట పోలీసులు అరెస్టు చేసి మూడు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నారు. నాగరాజుపై మూడు కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ద్విచక్రవాహనాల చోరీకి పాల్పడుతున్న నాగరాజును పట్టుకోవటానికి కృషి చేసిన హెచ్‌సీ శ్రీనివాసరెడ్డి, పీసి లక్ష్మణ్‌లను ఎస్ఐ సాయికిషోర్‌రెడ్డి అభినందించారు.

# వేర్వేరు ఘటనల్లో ఇరువురి ఆత్మహత్య

- చంద్రుగొండలో విషాదం

చంద్రుగొండ, సెప్టెంబరు12: మండల పరిధిలోని తిప్పనపల్లి గ్రామంలో వేర్వేరు కారణాలతో ఇద్దరు వ్యక్తులు బలవన్మరణం పొందారు. సంఘటనలకు సంబంధించిన వివరాలు.. సయ్యద్ జిలాని(48) తాపీ పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కాగా కొంత కాలంగా భార్యా నసీమాతో తరచూ గొడవలు జరుగుతున్నాయి. దీంతో ఆమె గ్రామంలోనే పుట్టింటికి వెళ్లింది. భార్యతో రాజీకి ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో బుధవారం అర్ధరాత్రి ఇంటి ఆవరణలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.

అదే విధంగా ఇదే గ్రామానికి చెందిన గుగులోత్ సోమ్లా(58) అనారోగ్యం బాధ భరించలేక క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. సోమ్లా గత కొన్నేళ్లుగా కిడ్నీ వ్యాధితో బాధ పడుతున్నాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కొత్తగూడెం, అక్కడి నుంచి ఖమ్మం తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో ఈ రెండు ఘటనలపై ఎస్ఐ స్వప్న కేసులు నమోదు చేసి విచారణ చేపట్టారు.

# పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయాలి

- సీపీ సునిల్‌దత్

ఖమ్మంక్రైం, సెప్టెంబరు12: గణేష్ నిమజ్జన సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ఠ ప్రణాళికతో బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు కమిషనర్ సునిల్‌దత్ పేర్కొన్నారు. గణేష్ నిమజ్జన, బందోబస్తు ఏర్పాట్లుపై గురువారం జిల్లాలోని పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సీపీ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా సుమారు 27వేల గణేష్ విగ్రహాలు రిజిస్టర్ అయి ఉన్నాయని, ఈరోజు వరకు 243విగ్రహాలు నిమజ్జనం చేసినట్లు సీపీ తెలిపారు. ఈకార్యక్రమంలో ఏడీసీపీలు నరేష్‌కుమార్, ప్రసాదరావు, ఏసీపీ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీ సునిల్‌దత్

## 16న మద్యం దుకాణాలు, బార్లు బంద్

గణేష్ శోభాయాత్ర, నిమజ్జనం ఉన్న నేపథ్యంలో ఖమ్మం కమిషనరేట్ పరిధిలో ఈనెల 16న మద్యంవిక్రయాలు నిలిపివేయాలని తెలిపారు. ఈనెల 16న ఉద యం 6గంటల నుంచి 17ఉదయం 6గంటల వరకు కమిషనరేట్ వ్యాప్తంగా మద్యం షాపులు, మద్యం సరఫరా చేసే బార్ అండ్ రెస్టారెంట్లు, క్లబ్బులు మూసివేయాలని ఆదేశించారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# నాణ్యమైన పౌష్టికాహారం అందించాలి

- అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్

ఖమ్మం కలెక్టరేట్, సెప్టెంబరు 12: ఆస్పత్రిలో రోగులకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించాలని అదనపు కలెక్టర్ డి.మధుసూదన్‌నాయక్ సూచించారు. గురువారం ఆయన ఖమ్మం ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని వంటశాలను పరిశీలించారు. రోగులకు అందించే ఆహార నాణ్యతను పరిశీలించారు. రోగులకు మధ్యాహ్న సమయంలో అందిస్తున్న భోజన వివరాలను అడిగి తెలుసుకున్నారు. నాణ్యమైన భోజనాన్ని అందించాలని సూచించారు. శుచికరమైన వస్తువులను మాత్రమే వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.



ఆస్పత్రిలో వంటశాలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ డి మధుసూదన్ నాయక్

# రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు జిల్లా జట్ల ఎంపిక

బోనకల్, సెప్టెంబరు 12: హైదరాబాద్‌లో ఈ నెల 14 నుంచి 15 వరకు జరగనున్న రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు గురువారం బోనకల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో జిల్లా బాలురు, బాలికల జట్ల ఎంపికలను పూర్తి చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి 120 మంది క్రీడాకారులు ఎంపికలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బాల్ బ్యాడ్మింటన్ జిల్లా అసోసియేషన్ కార్యదర్శి బొంతు శ్రీనివాసరావు, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ అమరేసి లింగ య్య, పీడీ రమేష్, శశిదర్, పీఈటీ సంధ్యారాణి, స్వాతి, రజిత, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

## కొణిజర్ల మండలం నుంచి ఒకరు..

కొణిజర్ల: హైదరాబాద్‌లో ఈనెల 13 నుంచి జరుగనున్న రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు మండలంలోని మైనార్టీ గురుకుల పాఠశాల విద్యార్థి ఎస్‌కే నజీర్ ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ జితేష్‌సాహిల్ గురువారం తెలిపారు. కల్లూరులో జరిగిన అండర్-14లో ఖోఖోలో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి జట్టులో ఆడేందుకు స్థానం దక్కించుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయిలో నజీర్ ఎంపికైనందుకు ప్రిన్సిపాల్, పీడీ, పీఈటీలు, సిబ్బంది అభినందించారు.

## మధిర మండలం నుంచి నలుగురు విద్యార్థినులు

మధిర రూరల్, సెప్టెంబరు 12: ఖోఖో సబ్ జూనియర్ తెలంగాణ రాష్ట్ర స్థాయి పోటీలకు మధిర మండలం మాటూరు, సిరిపురం ప్రభుత్వ పాఠశాలలకు చెందిన నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. కల్లూరు ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన 34వ తెలంగాణ రాష్ట్రస్థాయి ఖోఖో సబ్ జూనియర్ పోటీల ఎంపికలో మధిర మండలం సిరిపురం గ్రామానికి చెందిన కే పౌర్ణమి ఎంపికైనట్లు పీఈటీ కోటి, స్పోర్ట్ కన్వీనర్ టీం కోచ్ మన్నేపల్లి గురునాథం తెలిపారు. మాటూరు ఉన్నత పాఠశాలకు చెందిన సిలివేరు జయశ్రీ, మేడిశెట్టి భవాని, దేవిశెట్టి సుమలికలు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు చెరుపల్లి శ్రీహరి తెలిపారు. జిల్లా స్థాయిలో చక్కగా రాణిస్తూ రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థునులకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయ బృందం, గ్రామస్థులు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

# ఉద్యమాలకు స్ఫూర్తినిచ్చిన నేత

## ఉమ్మడి ఖమ్మం జిల్లాతో సీతారాం ఏచూరికి 40 ఏళ్ల అనుబంధం

ఖమ్మం టౌన్/భద్రాచలం, సెప్టెంబరు 12: సీపీఎం జిల్లా రాజకీయాల్లో 1985లో అడుగుపెట్టిన సీతారాం ఏచూరి చివరిసారిగా 2023 నవంబరు 25న సీపీఎం జిల్లా కార్యాలయంలో ఎన్నికలు-ప్రజాస్వామ్యం-సీపీఎం వైఖరి అనే అంశంపై సెమినార్‌లో పాల్గొని ప్రసంగించారు. జాతీయస్థాయిలో బిజీగా ఉన్నప్పటికీ జిల్లా సీపీఎం నేతలు పిలిచిన వెంటనే ఖమ్మం వచ్చి పాల్గొనేవారు. గత అసెంబ్లీ, ఎన్నికల్లో ఖమ్మం, పాలేరు ఎన్నికల ప్రచారంలో సీపీఎం అభ్యర్థుల ప్రచారంలో చివరిసారిగా పాల్గొన్నారు. స్వతహాగా కాంగ్రెస్ వ్యతిరేకియైన సీతారాం ఏచూరి విద్యార్థి దశనుంచే ఢిల్లీలో రాణించారు. సీపీఎంకు బలమైన కేంద్రంగా ఉమ్మడి ఖమ్మం జిల్లా ఉండటంతో ప్రత్యేక అభిమానం చూపించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రానికి మంచి మిత్రుడిగా రాష్ట్ర, దేశ రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తూనే ఖమ్మం జిల్లా పార్టీ కార్యక్రమాల్లో అనేక సందర్భాల్లో పాలుపంచుకున్నారు. 2012లో ఖమ్మంలో జరిగిన సీపీఎం ఉమ్మడి రాష్ట్ర మహాసభల్లో ఐదు రోజులపాటు ఖమ్మంలో ఉండి మహాసభలను విజయవంతం చేయటంలో కీలకపాత్ర వహించారు. 2003లో తమ్మినేని చేపట్టిన పాదయాత్రకు హాజరై స్ఫూర్తినిచ్చారు. తరువాత 2017లో దుమ్ముగూడెం ప్రాజెక్ట్ సాధనకోసం సీపీఎం ఆధ్వర్యంలో జరిగిన పాదయాత్రలో పాల్గొన్నారు. పోలవరం ప్రాజెక్ట్ నిర్వాసితుల ఆందోళనలో, సింగరేణి బొగ్గుగని కార్మికుల సమస్యలపైనా, 2008 జూలైలో ముదిగొండ పోలీస్‌కాల్పుల్లో మృతుల కుటుంబాల పక్షాన సీపీఎం సాగించిన పోరాటాలకు హాజరై తన ఉద్యమస్ఫూర్తిని చాటిచెప్పారు. ఖమ్మంలో జరిగిన రైతు, వ్యవసాయకూలీ సభలు, పోరాటాల్లో పాల్గొన్నారు.

### భద్రాద్రి జిల్లాతోనూ....

సీతారాం ఏచూరికి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాతో విడదీయరాని అనుబంధం ఉంది. కమ్యూనిస్టుల కంచుకోటగా విరాజిల్లిన భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రంలో ఆ పార్టీ డివిజన్ కార్యాలయం కామ్రేడ్ చందర్‌రావు భవన్ ప్రారంభోత్సవానికి 2002 డిసెంబరు 19న తొలిసారిగా ఆయన భద్రాద్రి వచ్చారు. అలాగే 2014 ఏప్రిల్ 23న అప్పటి సీపీఎం భద్రాచలం అసెంబ్లీ అభ్యర్థి సున్నం రాజయ్య మిత్రపక్షం, వైఎస్ఆర్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ తెల్లం వెంకట్రావుల విజయాన్ని కాంక్షిస్తూ భద్రాచలంలోని అన్నపూర్ణ ఫంక్షన్ హాల్లో జరిగిన ఎన్నికల ప్రచార సభలో పాల్గొని ప్రసంగించారు. ఇటీవల ఏపీలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గంలోని భద్రాచలానికి సరిహద్దున ఉన్న కూనవరం మండల కేంద్రంలో జరిగిన ప్రచార సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. అనంతరం కూనవరం నుంచి భద్రాచలం వచ్చి స్థానిక నాయకులతో కొద్దిసేపు మాట్లాడి తిరిగి హైదరాబాద్ వెళ్లారు. తొలినుంచి భద్రాచలం డివిజన్ సీపీఎం కమిటీ కార్యకలాపాలపై ఆసక్తి చూపిన సీతారాం ఏచూరి అనారోగ్యంతో మృతి చెందడంతో ఆ పార్టీ శ్రేణులు తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యాయి.



భద్రాచలంలో సీపీఎం నేతలతో ఏచూరి(ఫైల్)

# ఏచూరి మృతి తీరని లోటు

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

ఖమ్మంటౌన్,సెప్టెంబరు 12: సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి దేశాన్ని తీవ్రనష్టాన్ని కలిగిస్తుందని, కమ్యూనిస్టు ఉద్యమాల కీలకసమయంలో ఆయన మృతిచెందటం తీరనిలోటని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పేర్కొన్నారు. గురువారం జిల్లా సీపీఎం కార్యాలయంలో ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సంతాపసభలో తమ్మినేని మాట్లాడుతూ వచ్చే ఏడాది ఏప్రిల్‌లో తమిళనాడులో జరిగే పార్టీ జాతీయ మహాసభల్లో కీలక కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టవలసిన తరుణంలో, ఆయన మరణించడం తీవ్ర విషాదాన్ని నింపిందన్నారు. ఏచూరి మృతికి తెలంగాణ రాష్ట్ర సీపీఎం కమిటీ తరఫున తీవ్ర సంతాపం ప్రకటిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, కార్యదర్శి వర్గ సభ్యులు యర్రా శ్రీకాంత్, బండి రమేష్, వై. విక్రమ్, బుగ్గవీటి సరళ, మాచర్ల భారతి తదితరులున్నారు.

## ఏచూరి మృతికి పలువురి సంతాపం

ఖమ్మంటౌన్: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతిపట్ల సీపీఐ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే పువ్వాడ నాగేశ్వరరావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాగం హేమంతరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, బీఆర్ఎస్ పార్లమెంటరీ ఉపనేత, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు, ఖమ్మం మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.



సీతారాం ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న తమ్మినేని వీరభద్రం, నాయకులు

## ప్రపంచం ఒక మేధావిని కోల్పోయింది: మచ్చా

భద్రాచలం: సీపీఎం అఖిల భారత ప్రధాన కార్యదర్శి మాజీ రాజ్యసభ సభ్యులు సీతారాం ఏచూరి మరణం తీరని లోటని ప్రపంచం ఒక మేధావిని కోల్పోయిందని ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు అన్నారు. సీతారాం ఏచూరి మృతి చెందారని తెలిసిన వెంటనే ఆ పార్టీ నాయకులు భద్రాచలంలోని పార్టీ కార్యాలయంలో సమావేశమై తమ పార్టీ నేతకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సభలో సీపీఎం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, నాయకులు బిబిజి తిలక్, బండారు శరత్‌బాబు, ఎన్.లీలావతి, పి.సంతోష్‌కుమార్, ఎన్.నాగరాజు పాల్గొన్నారు.

# 'నా ఖమ్మం కోసం నేను' హిట్

- ఇప్పటివరకు రూ.11 లక్షలకు పైగా విరాళాల సేకరణ.

ఖమ్మం కలెక్టరేట్, సెప్టెంబరు 12: "నా ఖమ్మం కోసం నేను" అనే కార్యక్రమం కింద జిల్లాలో ముంపు బాధితుల సహాయార్థం ప్రజల నుంచి చేపడుతున్న విరాళం, ఉపయోగ వస్తువుల సేకరణకు మంచి స్పందన వస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. వినాయక చవితి నవరాత్రులను పురస్కరించుకుని వినాయక మండపాల వద్ద చేపట్టిన 'నా ఖమ్మం కోసం నేను' కార్యక్రమానికి జిల్లావ్యాప్తంగా మంచి ఆదరణ లభిస్తున్నట్టు, ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి, కార్యక్రమంలో భాగస్వామ్యం అవుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం కింద ఇప్పటివరకు రూ.11లక్షల 20 వేలకు పైగా సేకరించ డం జరిగిందని కలెక్టర్ తెలిపారు. ఈ విరాళాలతో పాటు, 7 వేల 419 కిలోల బియ్యం, 1230 జతల దుస్తులు, 9 బ్లాంకెట్లు, 75 స్టేషనరీ నోట్ పుస్తకాలు, 2 జతల చెప్పులు, 2 ఇతర వస్తువులు 'నా ఖమ్మం కోసం నేను' కార్యక్రమం కింద గ్రామాల నుంచి ముంపు బాధితుల సహాయార్థం సేకరించినట్లు జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.



వినాయక మండపం వద్ద వస్తువుల సేకరణలో జడ్పీ సీఈవో ఇతర అధికారులు

# విద్యుదాఘాతంతో రైతు మృతి

ఏన్కూరు, సెప్టెంబరు12: ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తో రైతు మృతి చెందిన సంఘటన బుధవారం శ్రీరామగిరి గ్రామంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం .. గ్రామానికి చెందిన రైతు దుగ్గినేని రామారావు(70) బుధవారం సాయంత్రం తన పొలం వద్దకు వెళ్లాడు. చేనుకు నీళ్లు పెట్టేందుకు మోటారు వద్దకు వెళ్తుండగా, కింద పడి ఉన్న విద్యుత్ వైర్ కాలికి తగిలి విద్యుత్‌షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు ఎస్ఐ బాదావత్ రవి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ధ్రువపత్రాల జారీకి క్యాంపులు భేష్..

- ప్రశంసించిన ఎమ్మెల్సీ కోదండరాం
- యాకూబ్, అశ్విని కుటుంబాలకు పరామర్శ

ఖమ్మం సంక్షేమ విభాగం, సెప్టెంబరు 12: వరదలో కొట్టుకుపోయిన ధ్రువపత్రాలను తిరిగి అందించడం కోసం ప్రత్యేకంగా క్యాంపులు నిర్వహించడం మంచి నిర్ణయమని టీజేఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ కోదండరాం హర్షం వ్యక్తం చేశారు. గురువారం జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన నగరంలోని నయాబజార్ కాలేజీలో ఏర్పాటు చేసిన వరద బాధితుల ధ్రువీకరణ పత్రాల క్యాం పును పరిశీలించారు. ఈ సందర్భంగా కేఎంసీ అధికారి శివలింగంతో మాట్లాడారు. ఎన్ని క్యాంపులు పెట్టారు.. ఎవరి ద్వారా ధ్రువపత్రాలను తెప్పిస్తారు.. ఇప్పటివరకు ఎన్ని దరఖాస్తులను స్వీకరించారు.. అని ప్రశ్నించారు. అధికారులు మాట్లాడుతూ ప్రత్యేకంగా ఫార్మాట్‌ను రూపొందించామని, బాధితులు కొన్ని వివరాలతో దరఖాస్తును అందిస్తే కలెక్టర్ ద్వారా సంబంధిత విద్యాశాఖ అధికారులకు పంపించి ఎస్ఎస్‌సీ బోర్డు, ఇంటర్ బోర్డు, యూనివర్సిటీల ద్వారా ధ్రువపత్రాలు అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ సందర్భంగా క్యాంపులో పనిచేస్తున్న అధికారులను కోదండరాం అభినందించారు.



అశ్విని, మోతీలాల్ చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న కోదండరాం

## యాకూబ్ పిల్లలకు పరామర్శ

కూసుమంచి: పాలేరు ఏటివరదల్లో మృతిచెందిన నాయకన్‌గూడెం గ్రామానికి చెందిన షేక్ యాకూబ్, సైదాబీ కుటుంబ సభ్యులను ఎమ్మెల్సీ కోదండరాం గురువారం పరామర్శించారు. జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన నాయకన్‌గూడెంలో కూలిపోయిన మృతుల నివాసాన్ని పరిశీలించారు. అనంతరం కూసుమంచిలో బంధువులు లాల్‌సాహెబ్ ఇంట్లో నివాసం ఉన్న మృతుల కుమారులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ప్రభుత్వం అండగా ఉంటుందని ఓదార్చారు. ఆయన వెంట జిల్లా జేఏసీ నాయకులు నర్సయ్య తదితరులు ఉన్నారు.

## యువ శాస్త్రవేత్త మృతి తీరనిలోటు

కారేపల్లి: వరదలో కొట్టుకుపోయి మృతిచెందిన యువ శాస్త్రవేత నూనవత్ అశ్విని, ఆమె తండ్రి మోతీలాల్ కుటుంబాన్ని గురువారం కోదండరాం పరామర్శించారు. గంగారాం తండాలో మృతుల కుటుంబసభ్యులను పరామర్శించి, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న వయస్సులోనే అశ్విని మృత్యువాతపడటం బాధాకరమన్నారు. ఆయన వెంట అంబటి శ్రీనివాస్‌రావు, గోపగాని శంకర్‌రావు, ఎం.నర్సయ్య, డోలి సత్యానారాయణ, రామనాథం, బి.రమేష్, కూరపాటి రంగనాథరావు తదితరులు ఉన్నారు.

# వరద బాధితులకు ప్రభుత్వం అండ

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- స్వచ్ఛంద సంస్థలు ముందుకురావడం హర్షణీయం

ఖమ్మం,సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతిప్రతినిధి): వరద బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. వరద సహాయ కార్యక్రమాల్లో స్వచ్ఛంద సంస్థలు ముందకు రావడం అభినందనీయమని ప్రశంసించారు. ఖమ్మంలో గురువారం తన క్యాంపు కార్యాలయంలో రోటరీక్లబ్ సహకారంతో ఖమ్మం మార్కెట్‌లో పనిచేసే దడవాయిలు, ఆటోడ్రైవర్లకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ గతంలో ఎన్నడు లేని విధంగా మున్నేరుకు భారీవరద వచ్చి ప్రజల జీవితాలు చిన్నాభిన్నమయ్యాయని, అయినా రాష్ట్ర ప్రభుత్వ బాధితులకు అండగా ఉండి సహాయ కార్యక్రమాలు చేపట్టిందని గుర్తుచేశారు. వరదల సమయంలో చేతన ఫౌండేషన్‌తో పాటు రోటరీక్లబ్, ఇస్కాన్, ఖమ్మంకార్పొరేషన్‌తో పాటు పలు సేవా సంస్థలు భోజనాలు అందించాయని తెలిపారు. వరద బాధితులను ఆదుకునేందుకు విపత్తు నిబంధనల ప్రకారం రూ.6,500 సహాయం ఉంటే దానికి రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.10వేలు కలిపి మొత్తం రూ.16,500 బాధితులకు అందించినట్లు తుమ్మల తెలిపారు. వరద సమయంలో ఎక్కువ మంది పేదలే నష్టపోయారన్నారు. హైదరాబాదులోని కూరగాయల మార్కెట్‌తో పాటు ఐటీ సంస్థల ఉద్యోగులు ముందుకు వచ్చి సహాయ కార్యక్రమాలకు సహకరించడం అభినందనీయమని మంత్రి ప్రశంసించారు.

## అంధ విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు

ఖమ్మంలోని చేతన ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంధ విద్యార్థులకు మంత్రి తుమ్మల ల్యాప్‌టాప్‌లు అందించారు. ల్యాప్‌టాప్‌లను విద్యార్థులు సమర్థవంతంగా వినియోగించుకుని విద్యా, ఉద్యోగాల్లో రాణించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి, గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు మేయర్ పునుకొల్లు నీరజ, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు దుర్గాప్రసాద్, చేతన ఫౌండేషన్ అధ్యక్షుడు వెనిగళ్ల రవికుమార్, సభ్యులు అనిల్‌కుమార్, దొడ్డా సీతారామయ్య రోటరీక్లబ్ ప్రతినిధులు కొండలరావు, సాంబశివరావు, కార్పొరేటర్లు కమర్తపు మురళి, పాలెపు వెంకటరమణ పాల్గొన్నారు.

## హైడ్రా పేరుతో విలేకరినంటూ బెదిరింపులు

» బాధితుడి ఫిర్యాదు.. నిందితుడి అరెస్టు

పటాన్‌చెరు, సెప్టెంబరు 12: తాను పత్రికా విలేకరినంటూ డబ్బుల కోసం బిల్డర్‌పై బెదిరింపులకు పాల్పడుతున్న ఒకరిని పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. హైదరాబాద్ నగర శివారులోని సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని బీరంగూడ సీబీఆర్ కాలనీలో బిల్డర్ జన్వాడ రవి ఓ భవనాన్ని నిర్మిస్తున్నారు. అయితే, రామచంద్రాపురం సాయినగర్‌కు చెందిన దగుడు రాము(42).. తనకు హైడ్రా కమిషనర్ రంగనాథ్, ఆర్డీవో, తహసీల్దార్ తెలుసునని, పాతబస్తీకి చెందిన పహిల్వాన్లతో తనకు పరిచయాలున్నాయని, నిర్మిస్తున్న భవనంపై కథనాలు రాసి కూల్చివేయిస్తానని బిల్డర్‌ను బెదిరించాడు. తనకు రూ.5 లక్షల ఇవ్వాలని లేదంటే తన పత్రికలో భవనం ఫొటో వేసి వార్తలు ప్రచురిస్తానని హెచ్చరించాడు. దీంతో బిల్డర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి నిందితుడు రామును అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు అమీన్‌పూర్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు తెలిపారు. పటాన్‌చెరు నియోజకవర్గం పరిధిలో కొందరు పత్రికలు, యూట్యూబ్ ఛానళ్ల ప్రతినిధుల పేరుతో డబ్బుల కోసం కొందరు బెదిరిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అలాంటి వారిపై కేసులు నమోదు చేస్తామని పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి హెచ్చరించారు.

## ఇక్కడ ఉండొద్దు ఖాళీ చెయ్యండి

» సున్నం చెరువు నిర్వాసితులకు హైడ్రా ఆదేశం

» ప్రత్యామ్నాయం చూపాలని బాధితుల వేడుకోలు

రాయదుర్గం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్, మాదాపూర్ సున్నం చెరువులో ఆక్రమణలను నాలుగు రోజుల క్రితం కూల్చేసిన హైడ్రా అధికారులు ఆ ప్రాంతాన్ని గురువారం మరోసారి పరిశీలించారు. ఆ స్థలంలో గుడిసెలు వేసుకున్న వారిని వెంటనే ఖాళీ చేసి వెళ్లిపోవాలని, గుడిసెలను కూడా తొలగించాలని ఆదేశించారు. ఆ స్థలంలో నివాసముండకూడదని స్పష్టం చేశారు. అయితే, చిన్నపిల్లలతో ఉన్న తాము ఇప్పటికిప్పుడు ఎక్కడికి వెళ్లాలని వారంతా ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వమే తమకు ప్రత్యామ్నాయం చూపాలని వేడుకున్నారు.

## సున్నం చెరువు పరిధిపై రీసర్వే చెయ్యండి

### ఎస్ఐఈటీ ఎంప్లాయిస్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ వినతి

పంజాగుట్ట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కష్టపడి సంపాదించిన పైసా పైసా కూడబెట్టి భూమిని కొనుగోలు చేసి అన్ని అనుమతులతో తాము నిర్మించుకున్న ఇళ్లను ఎఫ్‌టీఎల్ పేరుతో కూల్చివేయడం అన్యాయమని ఎస్ఐఈటీ(స్మాల్ ఇండస్ట్రీస్ ఎక్స్ టెన్షన్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్) ఎంప్లాయిస్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ ప్లాట్ల యజమానులు వాపోయారు. సున్నం చెరువు పరిధిపై రీ సర్వే చేయించి తమకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆ సొసైటీ అధ్యక్షుడు బీఎస్ఎస్ రాజు, ఇతర సభ్యులు మాట్లాడారు. శేరిలింగంపల్లి మండలం గుట్టల బేగంపేటలోని సర్వే నెంబర్ 12, 12ఏ,13లోని 24 ఎకరాల ప్రైవేట్ భూమిని 1990లో కొనుగోలు చేయగా, 1992లో హెచ్ఎండీఏ అనుమతులతో సొసైటీ సభ్యులకు కేటాయించామని తెలిపారు. ఆయా స్థలాలకు యూఎల్‌సీ, ఎల్ఆర్ఎస్, ఆస్తి పన్ను చెల్లించామని చెప్పారు. అన్ని అనుమతులు పొందడంతో కొందరు ఆ స్థలంలో ఇళ్లు నిర్మించుకున్నారని, కొందరు తాత్కాలిక నిర్మాణాలు చేపట్టారని వివరించారు. సున్నం చెరువు పరిధిపై రీ సర్వే చేయించి ఎఫ్‌టీఎల్ పరిధిని నిర్ణయించాలని, ఒక వేళ భూమి అంతా ప్రభుత్వం తీసుకుంటే తమకు ప్రత్యామ్నాయం చూపాలని డిమాండ్ చేశారు.

## మూడ్రోజులుగా నిలిచిన 'మీ-సేవ'!

» సర్వర్‌లో సాంకేతిక సమస్య.. రెండ్రోజులు పట్టే అవకాశం

బోయిన్‌పల్లి, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా మీ-సేవా కేంద్రాల్లో గత మూడ్రోజులుగా పౌర సేవలు నిలిచిపోయాయి. రాష్ట్ర స్థాయిలో వివిధ విభాగాలు, శాఖల సర్వర్లలో మార్పులు చేర్పులు చేస్తున్న నేపథ్యంలో ప్రధాన సర్వర్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతో ఈ పరిస్థితి ఎదురైంది. మూడ్రోజులుగా సేవలు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన సర్వర్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతో సేవలు నిలిచాయని, మరో రెండ్రోజుల్లో పునరుద్ధరించే అవకాశాలున్నాయని అధికారులు చెబుతున్నారు.

## బిల్లులు రాలేదని బడికి తాళం వేసిన కాంట్రాక్టర్

కామారెడ్డి రూరల్, సెప్టెంబరు 12: పాఠశాలలో చేసిన భవన నిర్మాణ పనులకు బిల్లులు రాలేదని ఓ కాంట్రాక్టర్ బడికి తాళం వేశాడు. ఈ సంఘటన కామారెడ్డి జిల్లాలో జరిగింది. కామారెడ్డి మండలంలోని చిన్నమల్లారెడ్డి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో కాంట్రాక్టర్ నిఖిల్ భవన నిర్మాణ పనులను ఏడాదిన్నర క్రితం చేపట్టారు. అప్పటి నుంచి బిల్లులు రాకపోవడంతో ఆవేదనకు గురై గురువారం బెంచీలు బయటవేసి, తరగతి గదులకు తాళం వేశాడు. దీంతో విద్యార్థులు బయట ఉన్న చెట్ల కింద కూర్చోవాల్సి వచ్చింది. కాంట్రాక్టర్ తీరుపైన ఉపాధ్యాయులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న పాఠశాల విద్యాకమిటీ సభ్యులు, గ్రామస్థులు కాంట్రాక్టర్‌కు సర్ది చెప్పడంతో తాళాలు తీశాడు.

## ఇన్‌స్టా రీల్‌తో చిన్నారులకు పెద్ద సాయం

### తల్లిని కోల్పోయిన పిల్లలకు రూ.21లక్షలు ఇచ్చిన దాతలు

నర్సింహులపేట(మహబూబాబాద్ జిల్లా), సెప్టెంబరు 12 : సోషల్ మీడియాను సక్రమంగా వాడుకుంటే అద్భుతాలు జరుగుతాయి, ఎన్నో సమస్యలు ఇట్టే పరిష్కారమవుతాయి అనేందుకు ఉదాహరణగా నిలిచే ఘటన మహబూబాబాద్ జిల్లాలో జరిగింది. తల్లిని కోల్పోయిన అభం శుభం తెలియని ఇద్దరు చిన్నారులకు మానవత్వం కలిగిన ఎన్నో హృదయాలు అండగా నిలిచాయి. ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ రీల్‌ను చూసి స్పందించిన దాతలంతా కలిసి ఆ చిన్నారులకు ఏకంగా రూ.21 లక్షలు ఆర్థిక సాయం చేసి ఔరా అనిపించారు. వివరాలిలా ఉన్నాయి.. మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలం బొజ్జన్నపేటకు చెందిన బేతమల్ల నరేష్, ఉమ దంపతులకు ఐదేళ్ల క్రితం వివాహమైంది. నరేష్ తాపీ మేస్త్రీగా పని చేస్తుంటాడు. ఈ దంపతులకు ఓ కుమార్తె(3), ఓ కుమారుడు(నెలన్నర) ఉన్నారు. అయితే, కొడుకును ప్రసవించిన ఎనిమిది రోజులకు, జూలై 28న ఉమ బ్రెయిన్ స్ట్రోక్ గురై మరణించింది. నిరుపేద అయిన తండ్రి, లోకం తెలియని ఆ పిల్లల పరిస్థితిని తెలుసుకున్న మహబూబాబాద్ జిల్లా కురివికి చెందిన సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్ గంగరబోయిన రఘు చలించిపోయారు. నరేష్ ఇంటికి వెళ్లి వారి పరిస్థితిని వివరించేలా ఓ వీడియో చేసి ఆ పిల్లలకు సాయం చేయాలని కోరుతూ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారు. రఘు పిలుపునకు స్పందించి ముందుకొచ్చిన దాతలు ఆర్థిక సాయం పంపారు. దాతల పంపిన మొత్తం రూ.21 లక్షలు అవ్వగా.. ఆ సొమ్మును చిన్నారుల పేరిట మహబూబాబాద్ ఎస్‌బీఐలో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. ఇందుకు సంబంధించిన పత్రాలను నరేష్‌కు గురువారం అందజేశారు. ఆ చిన్నారులకు ఇంత సాయం అందడానికి కారణమైన గంగరబోయిన రఘును పలువురు అభినందించారు.

## ట్రాఫిక్ ఉల్లంఘనలకు.. లైసెన్స్ రద్దు!


» ప్రమాదాల పెరుగుదల నేపథ్యంలో కఠిన చర్యలకు రవాణా శాఖ కసరత్తు..

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తున్న వాహనదారులపై మరింత కఠినంగా వ్యవహరించాలని రవాణా శాఖ నిర్ణయించింది. మోటార్ వాహన చట్టం ప్రకారం చర్యలకు రంగం సిద్ధం చేస్తోంది. ఇక నుంచి రాంగ్ రూట్ డ్రైవింగ్, సిగ్నల్ జంపింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, అతి వేగం, రేసింగ్‌లు తదితర ఉల్లంఘనల విషయంలో కూడా సీరియస్‌గా వ్యవహరించనున్నారు. మద్యం సేవించి వాహనం నడపడం, నిర్లక్ష్యపు డ్రైవింగ్ వంటి ఉల్లంఘనలకు మాత్రమే ప్రస్తుతం కోర్టు ఆదేశాలు, పోలీసుల సిఫారసు మేరకు 3 నుంచి 6 నెలల పాటు లైసెన్స్‌లను సస్పెన్షన్‌లో పెడుతున్నారు. మిగతా ఉల్లంఘనలకు సంబంధించి డ్రైవింగ్ లైసెన్స్ సస్పెండ్ చేయడం లేదు. ఈ నేపథ్యంలో చిన్న చిన్న ఉల్లంఘనలకు సంబంధించి కూడా ఇకపై లైసెన్స్‌లు సస్పెన్షన్‌లో పెట్టనున్నట్టు రవాణా శాఖ వర్గాలు తెలిపాయి. మెజార్టీ రోడ్డు ప్రమాదాలకు వాహనదారులు నిబంధనలు పాటించకపోవడం కారణమని గుర్తించిన నేపథ్యంలో నిబంధనల కచ్చిత అమలుకు అవసరమైన చర్యలు చేపడుతున్నారు. కాగా, గత రెండున్నరేళ్లలో వివిధ ఉల్లంఘనలకు సంబంధించి 26 వేలకుపైగా డ్రైవింగ్ లైసెన్స్‌లను రవాణా శాఖ సస్పెండ్ చేసింది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాల పరిధిలో 2022-23లో అత్యధికంగా 16 వేలకు పైగా లైసెన్స్‌లు సస్పెండ్ చేశారు. 2023-24లో 7 వేలకు పైగా.. ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు 2,200 లైసెన్స్‌లు సస్పెన్షన్‌లో పెట్టారు.

# రాహుల్‌ను ప్రధానిని చేయడమే లక్ష్యంగా కార్యాచరణ

» ఢిల్లీలో ఏఐసీసీ చీఫ్ ఖర్గేతో మహేష్‌కుమార్ గౌడ్ భేటీ

» ఉప ఎన్నికలు రాకపోవచ్చన్న టీపీసీసీ కొత్త అధ్యక్షుడు



ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మహేష్‌కుమార్ గౌడ్, కుటుంబ సభ్యులు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే లక్ష్యంగా తన కార్యాచరణ ఉంటుందని టీపీసీసీ అధ్యక్షుడిగా కొత్తగా నియమితులైన మహేష్‌కుమార్‌గౌడ్ తెలిపారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా ఆయన తన కుటుంబసభ్యులతో పాటు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను రాజాజీమార్గ్‌లోని నివాసంలో కలుసుకున్నారు. అనంతరం మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ ఖర్గే ఆశీర్వాదం కోసం వచ్చినట్లు తెలిపారు. అన్ని వర్గాలను కలుపుకుని కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని ఖర్గే సూచించినట్లు తెలిపారు. పీసీసీ అధ్యక్షుడు మారిన ప్రతిసారి కొత్త కమిటీలు ఏర్పడతాయని, కొత్త కమిటీల విషయంలో ఏఐసీసీ పెద్దలతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. కమిటీల ఏర్పాటులో వెనుకబడిన వర్గాలకు పెద్దపీట వేస్తామని చెప్పారు. ప్రభుత్వం, పార్టీ సమన్వయంతో ముందుకు సాగాల్సి ఉంటుందన్నారు. పార్టీ ఫిరాయించిన అంశంలో హైకోర్టు నిర్ణయాన్ని గౌరవిస్తూనే.. న్యాయప్రత్యామ్నాయాలు చూస్తామని తెలిపారు. తమ పార్టీ విధానాలు, పాలన చూసి కొందరు నేతలు వస్తే చేర్చుకున్నట్లు మహేష్‌కుమార్ గౌడ్ తెలిపారు. ప్రతిపక్ష పాత్ర నిర్వహించే స్థితిలో బీఆర్ఎస్ నేతలు లేరని, లోక్‌సభ ఎన్నికలలో ప్రజలు వారికి సున్నా స్థానాలు ఇచ్చారని ఆయన గుర్తు చేశారు. ఎమ్మెల్యేల ఫిరాయింపు అంశంలో ఉప ఎన్నికలు వస్తాయని తాను భావించడంలేదని, ఒక వేళ వచ్చినా ఆ స్థానాలు తమ ఖాతాలోనే పడతాయని మహేష్‌కుమార్ గౌడ్ ఆశాభావం వ్యక్తం చేశారు. అరికెపూడి గాంధీ సాంకేతికంగా బీఆర్ఎస్ సభ్యుడని, నిబంధనల మేరకే పీఏసీ చైర్మన్ అయ్యారని అన్నారు. మరోవైపు ఎయిమ్స్ ఆస్పత్రిలో సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి భౌతిక కాయానికి మహేష్‌కుమార్ గౌడ్ నివాళులు అర్పించారు.

# విద్యుత్తు కొనుగోళ్లపై నిషేధం!

## పవర్‌గ్రిడ్‌కు రూ.261 కోట్లు చెల్లించలేదని టీజీఎస్పీడీసీఎల్‌పై గ్రిడ్ కంట్రోలర్ ఆఫ్ ఇండియా చర్యలు

» ఛత్తీస్‌గఢ్ విద్యుత్తు కొనుగోలులో గత ప్రభుత్వ నిర్వాకంతోనే..

» హైకోర్టును ఆశ్రయించిన ఎస్పీడీసీఎల్

» పవర్‌గ్రిడ్ ఉత్తర్వులపై స్టే విధించిన కోర్టు



హైదరాబాద్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ దక్షిణ ప్రాంత విద్యుత్తు సంస్థ (టీజీఎస్పీడీసీఎల్)కు గత ప్రభుత్వ నిర్వాకంతో షాక్ తగిలింది. ముందుచూపు లేకుండా తీసుకున్న నిర్ణయం డిస్కమ్‌కు శాపంలా మారింది. ఛత్తీస్‌గఢ్ నుంచి 1000 మెగావాట్ల విద్యుత్తును తీసుకుంటామని కారిడార్ బుక్ చేసుకున్న తర్వాత, అవసరం లేదని పేర్కొన్న కేసులో రూ.261.31 కోట్లను ఎస్పీడీసీఎల్ చెల్లించడం లేదంటూ పవర్ గ్రిడ్ జాతీయ లోడ్ డిస్పాచ్ సెంటర్ (ఎన్ఎల్‌డీసీ)కు ఫిర్యాదు చేసింది. స్పందించిన ఎన్ఎల్‌డీసీ బహిరంగ విపణిలో ఎస్పీడీసీఎల్ విద్యుత్తు క్రయవిక్రయాలపై గురువారం ఉదయం నిషేధం విధించింది. గత ప్రభుత్వం ఛత్తీస్‌గఢ్‌లోని మార్వా ప్లాంట్ నుంచి 1000 మెగావాట్లు, అదనంగా మరో 1000 మెగావాట్ల కోసం పవర్‌గ్రిడ్‌తో ఒప్పందం చేసుకున్న విషయం తెలిసిందే. విద్యుత్తు చెల్లింపుల వివాదంతో మార్వా ప్లాంట్ నుంచి 1000 మెగావాట్ల కరెంట్ ఆగిపోగా.. అదనంగా తీసుకుంటామని చెప్పిన 1000మెగావాట్లపై బీఆర్ఎస్ సర్కారు వెనక్కి తగ్గింది. అయితే, తెలంగాణ ప్రభుత్వ విజ్ఞప్తితో లైన్లు వేసినప్పటికీ వినియోగించుకోకుండా వదిలేసినందున చార్జీల కింద రూ.261.31కోట్లు చెల్లించాలంటూ మార్చి 12న పవర్ గ్రిడ్ తెలంగాణ పవర్ కో-ఆర్డినేషన్ కమిటీకి బిల్లును పంపింది. దీనిపై కేంద్ర విద్యుత్తు నియంత్రణ మండలి (సీఈఆర్‌సీ)లో టీజీఎస్పీడీసీఎల్ పిటిషన్ వేసింది. ఈ కేసులో వాదనలు జరగాల్సి ఉండగా.. 'గ్రిడ్ కంట్రోలర్ ఆఫ్ ఇండియా'కు పవర్ గ్రిడ్ ఫిర్యాదు చేసింది. దీంతో బహిరంగ విపణిలో కరెంట్ కొనుగోళ్లకు అవకాశం లేకుండా కట్టడి చేస్తూ బుధవారం ప్రాప్తి (పేమెంట్ రాటిఫికేషన్ ఇన్ పవర్ ప్రొక్యూర్‌మెంట్ ఫర్ బ్రింగింగ్ ట్రాన్స్‌పరెన్సీ ఇన్ ఇన్‌వాయిసింగ్ ఆఫ్ జనరేటర్స్) పోర్టల్ నోటిఫికేషన్ ఇచ్చింది. దీని ఆధారంగా గురువారం ఉదయం నుంచి కరెంట్ కొనుగోళ్లు నిలుపుదల చేసింది. విషయం తెలిసిన వెంటనే ఢిల్లీలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. రాష్ట్రంలో విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. వెంటనే హైకోర్టులో లంచ్‌మోషన్ పిటిషన్ వేయాలని ఆదేశించారు. సీఎం సూచనలతో అధికారులు కోర్టును ఆశ్రయించారు.

### స్టే విధించిన హైకోర్టు

చార్జీల కేసు సీఈఆర్‌సీలో పెండింగ్‌లో ఉండగా కఠిన చర్యలు చేపట్టడం అక్రమమని, రాష్ట్ర ప్రజలకు విద్యుత్తు సరఫరా నిలిచిపోతుందని పేర్కొంటూ టీజీఎస్పీడీసీఎల్ హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి ధర్మాసనం విచారణ చేపట్టింది. డిస్కం తరఫున అడ్వొకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపించారు. కమిషన్ వద్ద కేసు పెండింగ్‌లో ఉండగానే ప్రతివాదులు లేట్ పేమెంట్ సర్‌చార్జి నిబంధనల కింద పిటిషనర్‌ను డీఫాల్టర్ జాబితాలో పెట్టడం అక్రమమని తెలిపారు. పిటిషనర్ విద్యుత్తు కొనుగోళ్లలో పాల్గొనేలా అనుమతించాలని కోరారు. పవర్‌గ్రిడ్, కేంద్రం తరఫున అసిస్టెంట్ సొలిసిటర్ జనరల్ గాడి ప్రవీణ్ వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్‌కు నోటీసు ఇచ్చి ఆరు నెలలైనా స్పందించకపోవడం వల్లే చర్యలు తీసుకోవాల్సి వచ్చిందని చెప్పారు. ఇదే తరహా వివాదంలో 25శాతం చార్జీలు చెల్లిస్తే విద్యుత్తు కొనుగోళ్లకు అనుమతించాలని ఢిల్లీ హైకోర్టు ఇటీవల తీర్పు ఇచ్చిందని తెలిపారు. పిటిషనర్ కూడా రూ.261 కోట్లలో 25 శాతం చెల్లిస్తే పవర్ ట్రేడింగ్‌కు అనుమతిస్తామని చెప్పారు. వాదనలు విన్న ధర్మాసనం 'ఇది రాష్ట్రంలోని కోట్లాది మందికి విద్యుత్తు సరఫరాకు సంబంధించిన అంశం. సరఫరా నిలిచిపోతే ఇబ్బందులొస్తాయి. ఇతర వనరులు అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో తెలంగాణ సొంతంగా విద్యుదుత్పత్తి చేసుకోగలుగుతోంది. రాష్ట్రానికి కారిడార్ అవసరం లేకపోయి ఉండొచ్చు'అని పేర్కొంది. చార్జీల వివాదం సెంట్రల్‌కమిషన్ వద్ద పెండింగ్‌లో ఉండగా విద్యుత్తు కొనుగోళ్లు చేయకుండా పిటిషనర్‌ను అడ్డుకోవడం సరికాదని పేర్కొంది. ప్రాప్తి పోర్టల్ ద్వారా జారీచేసిన ఉత్తర్వులపై స్టే విధిస్తున్నట్లు ప్రకటించింది. పిటిషనర్‌ను విద్యుత్తు క్రయవిక్రయాల్లో పాల్గొనేందుకు అనుమతించాలని స్పష్టం చేసింది. తదుపరి ఉత్తర్వులిచ్చే వరకు ఆదేశాలు కొనసాగుతాయని పేర్కొంటూ విచారణను అక్టోబరు 17కు వాయిదా వేసింది. ఈ విషయాన్ని వెంటనే ప్రతివాదులకు తెలియజేయాలని ప్రవీణ్‌కుమార్‌ను ఆదేశించింది. ఈ అంశంపై వివరణ ఇవ్వాలంటూ గ్రిడ్ కంట్రోలర్ ఆఫ్ ఇండియా, పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్, సెంట్రల్ ట్రాన్స్‌మిషన్ యుటిలిటీ ఆఫ్ ఇండియా, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఇండియన్ ఎనర్జీ ఎక్స్ఛేంజ్, కేంద్ర విద్యుత్తు శాఖకు నోటీసులు జారీచేసింది.

## బతకడానికి వచ్చినోళ్ల ఓట్లతోనే బీఆర్ఎస్‌కు సీట్లు

(మొదటిపేజీ తరువాయి)

వ్యాఖ్యానించారు. గురువారం ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో తెలుగు మీడియాతో రేవంత్ ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. బీఆర్ఎస్‌లో చిల్లరగాళ్లు, బ్రోకర్లు చేరినందుకే కేసీఆర్ దగ్గరికి వెళ్లేందుకు తనకు మనసు రావడం లేదని అరికెపూడి గాంధీ అంటున్నారని తెలిపారు. "ధర్నాలు చేయొద్దు. ఎక్కడి నుంచి వచ్చారు?" అని గతంలో కేసీఆర్ ఆంధ్రవారిని ఉద్దేశించి అన్న మాటలనే ఇప్పుడు కౌశిక్ రెడ్డి అంటున్నారని ధ్వజమెత్తారు. గాంధీకి పీఏసీ పదవి ఇవ్వడంలో తప్పేమీ లేదని.. గతంలో కూడా ఇతరులను పీఏసీలో నియమించిన సందర్భాలు ఉన్నాయని చెప్పారు. బీఆర్ఎస్‌కు తాము ఓనర్లమయినందున ఆ స్థానంలో తామే ఉండాలని హరీశ్ భావిస్తున్నారని ఆరోపించారు. 2018-23 మధ్య కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉంటే.. అక్బరుద్దీన్ ఒవైసీని పీఏసీ చైర్మన్‌గా ఎలా నియమించారని రేవంత్ ప్రశ్నించారు. 2014లో టీడీపీలో 15 మంది ఎమ్మెల్యేలున్నా బీఏసీకి ఎర్రబెల్లిని రానిచ్చారని, తనను అనుమతించలేదని.. ఎర్రబెల్లి పార్టీ మారినప్పుడు టీడీపీ ఫ్లోర్ లీడర్‌గా తనను నియమించాలంటూ చంద్రబాబు లేఖ ఇచ్చినా నాటి సభాపతి పట్టించుకోలేదని గుర్తుచేశారు. కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలపై స్పీకర్ నాలుగు వారాలలో నిర్ణయం తీసుకోవాలని హైకోర్టు ఇచ్చిన తీర్పును తాను అధ్యయనం చేయలేదని చెప్పారు. ప్రభుత్వాన్ని పడగొడతామని బెదిరింపులు చేసినందుకే ఇటువంటి సమస్యలు వస్తున్నాయని.. అలా పడగొట్టే అవకాశం లేకపోతే తమకొచ్చే ప్రమాదం ఏమీ ఉండదని అన్నారు. ఏ పార్టీ వాళ్లు ఆ పార్టీలోనే ఉండాలని అంటే తనకొచ్చిన ఇబ్బందేమీ లేదని, కేసీఆర్ లక్కీ నెంబర్ అయిన 66మంది ఎమ్మెల్యేల బలం కాంగ్రెస్‌కు ఉందని చమత్కరించారు. బీఏసీలో అన్ని పార్టీలకూ తాము అవకాశం ఇచ్చామని, కాంగ్రెస్‌కు తరఫున నలుగురు ఉంటే బీఆర్ఎస్ నుంచి ఆరుగురిని, సీపీఐ, బీజేపీ, ఎంఐఎం నుంచి ఒక్కొక్కరిని చేర్చుకున్నామని చెప్పారు. కౌన్సిల్‌లో తమకు మెజారిటీ లేనందువల్ల బీఆర్ఎస్ నుంచి ముగ్గురిని తీసుకున్నామని, ఆ పార్టీకి తామేమీ లోటు చేయలేదన్నారు.



ఏపీ సీఎం చంద్రబాబుకు జ్ఞాపికను అందజేస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దంపతులు

## చంద్రబాబును అభినందించిన ఉత్తమ్

### వెలగపూడి సచివాలయంలో బాబుతో భేటీ

అమరావతి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నాలుగోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన సీఎం చంద్రబాబు నాయుడును తెలంగాణ జలవనరుల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్ రెడ్డి అభినందించారు. తన మిత్రుడి ఇంట జరిగిన ఓ కార్యక్రమానికి హాజరయ్యేందుకు గురువారం విజయవాడకు వచ్చిన ఉత్తమ్‌కుమార్ రెడ్డి దంపతులు వెలగపూడి సచివాలయంలో సీఎం చంద్రబాబుతో భేటీ అయ్యారు. బాబుకు అభినందనలు తెలిపారు. ముఖ్యమంత్రిగా నాలుగోసారి బాధ్యతలు స్వీకరించడం పట్ల సంతోషంగా ఉందని ముఖ్యమంత్రితో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. కాగా.. ఇరువురి మధ్య స్నేహపూర్వక పరస్పర అభినందనలు మినహా.. రాష్ట్రాల అంశాలు ప్రస్తావనకు రాలేదని ఉత్తమ్‌కుమార్ రెడ్డి 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

## మంత్రివర్గ విస్తరణపై వచ్చే వారమే చర్చలు?

న్యూఢిల్లీ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మంత్రివర్గ విస్తరణపై కాంగ్రెస్ అధిష్ఠానంతో సీఎం రేవంత్‌రెడ్డి చర్చలు వచ్చే వారమే జరిగే అవకాశాలున్నాయి. రేవంత్ వచ్చే సోమవారం (16న) మరోసారి ఢిల్లీకి రానున్న సంగతి తెలిసిందే. అయితే.. పార్టీ సంస్థాగత ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో గురువారం ఆయన నివాసంలో భేటీ అయిన రేవంత్ రెడ్డి దీనిపై ప్రాథమిక చర్చలు జరిపినట్లు సమాచారం. అంతకుముందు మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడిన సమయంలో మంత్రివర్గ విస్తరణపై సీఎంను ప్రశ్నించగా.. పీసీసీ అధ్యక్షుడే దానికి సమాధానం చెబుతారని ఆయన పేర్కొన్నారు. మంత్రివర్గాన్ని విస్తరించాలని పార్టీ అధ్యక్షుడిగా ఆయన నిర్ణయిస్తే.. ఎవరెవరిని తీసుకోవాలో తాను నిర్ణయిస్తానని చెప్పారు. మీడియాతో చిట్‌చాట్ అనంతరం రేవంత్ హైదరాబాద్‌కు తిరుగుపయనమయ్యారు.

# 'స్థానికత'పై సుప్రీం కోర్టుకు సర్కారు

» త్వరగా విచారించాలన్న విజ్ఞప్తికి ధర్మాసనం ఓకే

» హైకోర్టు తీర్పుతో రాష్ట్రంలో ఆగిన వైద్య విద్య ప్రవేశాలు

» సర్కారుకు అనుకూలంగా తీర్పు వస్తే వేగంగా అడ్మిషన్లు

» లేదంటే మళ్లీ మార్గదర్శకాలు ఇవ్వాల్సిందే



న్యూఢిల్లీ/హైదరాబాద్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): వైద్య విద్య ప్రవేశాల్లో స్థానికత వ్యవహారంపై తెలంగాణ ప్రభుత్వం సుప్రీం కోర్టును ఆశ్రయించింది. వైద్య విద్యలో అడ్మిషన్లు పొందడానికి తొమ్మిది, పది తరగతులతోపాటు ఇంటర్మీడియట్ విద్యను తెలంగాణలో పూర్తి చేసిన వారికే స్థానిక రిజర్వేషన్ వర్తింపజేస్తామంటూ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 33పై పలువురు హైకోర్టును ఆశ్రయించగా.. కోర్టు సైతం అభ్యంతరం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. రాష్ట్రంలో వరుసగా నాలుగేళ్లు చదువుకోలేదన్న కారణంతో శాశ్వత నివాసులకు ఎంబీబీఎస్, బీడీఎస్ అడ్మిషన్ నిరాకరించకూడదని సదరు ఆదేశాల్లో పేర్కొంది. దీన్ని సవాల్ చేస్తూ తాజాగా రాష్ట్ర ప్రభుత్వం గురువారం సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌ను వెంటనే విచారణకు స్వీకరించాలని ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనాన్ని తెలంగాణ తరఫు న్యాయవాదులు కోరగా.. ధర్మాసనం అంగీకరించింది. అయితే, వైద్య విద్య ప్రవేశాలపై సందిగ్ధం నెలకొన్న వేళ.. సుప్రీం కోర్టు ఏం తీర్పు వెలువరిస్తుందన్న అంశంపై ఉత్కంఠ నెలకొంది. ఒక వేళ హైకోర్టు తీర్పుపై సుప్రీం కోర్టు స్టే ఇస్తే.. వెంటనే ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఒక వేళ హైకోర్టు తీర్పును సమర్థిస్తే మాత్రం కౌన్సెలింగ్ ప్రక్రియ మరింత ఆలస్యమయ్యే అవకాశం ఉందని వైద్య శాఖ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. గతంలో సుప్రీం కోర్టు జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం అక్టోబరు 1 నుంచే వైద్య విద్య తరగతులు ప్రారంభం కావాలి. అక్టోబరు 30లోగా వైద్య విద్య ప్రవేశాల ప్రక్రియ పూర్తి చేయాలి. ఆ తర్వాత ఎలాంటి ప్రవేశాలు చేపట్టకూడదు. అందుకు మరో 47 రోజులే గడువు ఉండగా.. రాష్ట్రంలో ఇప్పటిదాకా ప్రవేశాల ప్రక్రియే ప్రారంభం కాకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఇదే విషయమై వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ బుధవారం వైద్య, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో వైద్య విద్య ప్రవేశాలపై సమీక్ష నిర్వహించారు. కౌన్సెలింగ్ పూర్తి కావడానికి ఎన్ని రోజుల సమయం పడుతుందంటూ ఆరా తీశారు. ఒక వేళ సుప్రీంకోర్టులో అనుకూల తీర్పు రాకుంటే తక్షణమే స్థానికతపై మార్గదర్శకాలు రూపొందించాల్సి ఉంటుందని, ఆ ప్రకారం రెసిడెన్స్ సర్టిఫికెట్ల జారీకి సమయం పడుతుందని అధికారులు మంత్రికి వివరించారు.


### 4 రౌండ్లు... ఒక్కో దానికి 10 రోజులు

ఎంబీబీఎస్, బీడీఎస్, ఆయుష్ కోర్సుల్లో ప్రవేశాల కౌన్సెలింగ్‌ను నాలుగు విడతల్లో నిర్వహిస్తారు. కన్వీనర్, యాజమాన్య, ఎన్ఆర్ఐ కోటా సీట్ల భర్తీ తర్వాత, విద్యార్థులు చేరకుండా మిగిలిపోయిన సీట్లకు చివరిగా స్ట్రే వేకెన్సీ రౌండ్ ద్వారా భర్తీ చేస్తారు. ఒక్కో రౌండ్‌కు కనీసం పది రోజుల సమయం పడుతుంది. ఈ ఏడాది ఎంబీబీఎస్‌లో కన్వీనర్ కోటా సీట్ల కోసం 17,654 మంది, యాజమాన్య, ఎన్ఆర్ఐ కేటగిరీల కింద మరో 6,468 మంది దరఖాస్తు చేసుకున్నారు. వెరసి మొత్తం 24,122 మంది తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. అడ్మిషన్ల ప్రక్రియ అంతా అక్టోబరు 30లోగానే పూర్తి చేయాలి. సుప్రీం కోర్టు మార్గదర్శకాల ప్రకారం ఆలోగా ప్రక్రియ పూర్తి చేయకుంటే మిగిలిపోయిన సీట్లను అలా వదిలేయాల్సిందే. ఈ నేపథ్యంలో అటు వైద్యశాఖలోనూ, ఇటు విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లోనూ తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. వాస్తవానికి గత నెల 3వ తేదీ నుంచే దేశ వ్యాప్తంగా ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైంది. ఆలిండియా కోటా సీట్లకు ఆగస్టు రెండో వారంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇప్పటికే దాదాపు అన్ని రాష్ట్రాల్లోనూ మొదటి విడత కౌన్సెలింగ్ పూర్తయింది. సుప్రీం కోర్టులో రాష్ట్ర ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పువచ్చినా...సమయం సరిపోకపోవచ్చన్న అభిప్రాయాలున్నాయి.ఈ నేపథ్యంలో ఒక వేళ రాష్ట్రంలో సీటు రాని విద్యార్థులు.. పొరుగు రాష్ట్రాల్లోని కాలేజీల్లో చేరే అవకాశం కోల్పోనున్నారు.

# కేంద్ర సెస్సులు, సర్‌చార్జీలను నిరోధించాలి

## లేదంటే వాటిలోనూ రాష్ట్రాలకు వాటా ఇవ్వాలి.. పన్నుల వాటాను 41 నుంచి 50 శాతానికి పెంచాలి

» బీజేపీయేతర రాష్ట్రాల మంత్రుల భేటీలో డిప్యూటీ సీఎం భట్టి



హైదరాబాద్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం వసూలు చేస్తున్న సెస్‌లు, సర్‌చార్జీల వల్ల రాష్ట్రాల పన్నుల వాటా నిధుల్లో కోత పడుతోందని రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి సెస్‌లు, సర్‌చార్జీలను నిరోధించాలని లేదంటే వాటిలోనూ రాష్ట్రాలకు వాటా ఇవ్వాలని డిమాండ్ చేశారు. దేశంలోని ఐదు బీజేపీయేతర రాష్ట్రాలైన తెలంగాణ, కేరళ, కర్ణాటక, తమిళనాడు, పంజాబ్ ఆర్థిక మంత్రుల సమావేశం గురువారం కేరళలోని తిరువనంతపురంలో జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న భట్టివిక్రమార్క.. పన్నుల వాటా విషయంలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాన్ని తప్పుపట్టారు. కేంద్ర పన్నుల్లో రాష్ట్రాలకు ఇచ్చే నిధులను 14వ ఆర్థిక సంఘం 32 నుంచి 42 శాతానికి పెంచిందని, 15వ ఆర్థిక సంఘం దాన్ని 41 శాతానికి కుదించిందని తెలిపారు. ఈ 41 శాతం నిధులు కూడా రాష్ట్రాలకు రావడం లేదని, కేవలం 31 శాతం నిధులు మాత్రమే అందుతున్నాయని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం సెస్‌లు, సర్‌చార్జీలను వసూలు చేస్తుండడంతో పన్నుల వాటా తగ్గుతుందని అన్నారు. వీటిని కూడా రాష్ట్రాలకు పంచాలని అడుగుతుంటే కేంద్రం పట్టించుకోవడం లేదన్నారు. దక్షిణాది రాష్ట్రాలు కేంద్ర జీడీపీకి 30 శాతం భాగస్వామ్యాన్ని అందిస్తున్నాయని, దేశ జనాభాలో 19.6 శాతం జనాభా ఈ రాష్ట్రాల్లోనే ఉందని తెలిపారు. కానీ, ఈ రాష్ట్రాలకు పన్నుల్లో వాటా నిధులు 21.07 శాతం నుంచి 15.80 శాతానికి తగ్గిపోయాయని చెప్పారు. వస్తు సేవల పన్ను (జీఎస్టీ) కింద రాష్ట్రాలకు ఇవ్వాల్సిన పరిహారాన్ని సకాలంలో ఇవ్వడం లేదని, పర్యవసానంగా రాష్ట్రాలు ఆర్థిక ప్రణాళికను రూపొందించుకోవడంలో ఇబ్బంది పడాల్సి వస్తోందని అన్నారు. కేంద్ర ప్రాయోజిత పథకాల(సీఎస్ఎస్)లో కఠినమైన నిబంధనలున్నాయని, వాటికి రాష్ట్రాలు మ్యాచింగ్ గ్రాంట్‌ను విడుదల చేయాల్సి వస్తుండడంతో ఆర్థిక భారం పడుతుందని చెప్పారు. ఇలా సీఎస్ఎస్‌ల కోసం రాష్ట్ర సొంత వనరులను మళ్లించాల్సి వస్తుండడంతో ఇతర ముఖ్యమైన రాష్ట్ర పథకాలకు నిధుల కొరత ఏర్పడుతుందన్నారు. రాష్ట్రాలకు నికరంగా వచ్చే పన్నుల వాటా నిధులను తగ్గిస్తూ.. మరోవైపు రాష్ట్రాలకు సరిగా ఉపయోగపడని సీఎస్ఎస్‌లకు కేంద్ర ప్రభుత్వం నిధులను పెంచుతోందని ఆరోపించారు. ఇప్పటికే దేశ ద్రవ్య లోటు జీడీపీలో 5.6 శాతానికి పెరిగిందన్నారు. ద్రవ్య బాధ్యతను పాటిస్తున్న రాష్ట్రాలకు ఒక నీతి, ద్రవ్యలోటు పెరుగుతున్నా యథేచ్ఛగా రుణాలు తీసుకునే కేంద్రానికి మరో నీతా అని ప్రశ్నించారు.

**ఇవీ రాష్ట్ర డిమాండ్లు..**

- కేంద్ర ప్రభుత్వ సెస్సులు, సర్‌చార్జీలను నిరోధించాలి.
- కేంద్ర పన్నుల్లో వాటాను 41 నుంచి 50 శాతానికి పెంచాలి.
- ద్రవ్య బాధ్యత పాటించే రాష్ట్రాలు ఎక్కువ రుణాలు తీసుకునేలా స్వయంప్రతిపత్తిని కల్పించాలి.
- డీలిమిటేషన్ ప్రక్రియలో దక్షిణాది రాష్ట్రాలకు లోక్‌సభ సీట్లు పెరిగేలా చూడాలి.
- కేంద్రప్రాయోజిత పథకాలను రాష్ట్రాలు తమ అవసరాలకు తగ్గట్టు వినియోగించుకునే అవకాశమివ్వాలి.



## విద్యార్థులు క్రీడలలో రాణించాలి: ఎమ్మెల్యే జారే


క్రీడాదుస్తులు అందజేస్తున్న ఎమ్మెల్యే

దమ్మపేట, సెప్టెంబరు 12: విద్యార్థులు క్రీడలలో రాణించాలని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆకాంక్షించారు. గండుగులపల్లి జిల్లాపరిషత్ పాఠశాలలో క్రీడలలో రాణిస్తున్న 50 మంది విద్యార్థులకు ఎమ్మెల్యే తన స్వంత నిధులతో క్రీడా దుస్తులను పాఠశాలలో గురువారం జరిగిన కార్యక్రమంలో అందజేసారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులకు క్రీడలు, చదువు అవసరమేనని విద్యవల్ల జ్ఞానం వస్తుందని, క్రీడలు శారీరక ఆరోగ్యంతో పాటు పేరు ప్రతిష్ఠలు తెచ్చిపెడతాయన్నారు. విద్యార్థులు క్రీడలలో రాణించి గండుగులపల్లి గ్రామాని పేరు తీసుకు రావాలని కోరారు. ఈకార్యక్రమంలో కాసాని నాగ ప్రసాదు, ఎర్రా వసంతరావు, మెచ్చు వెంకటేశ్వర్లు, సుశీల ప్రసాదు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### స్వర్గధామం అభివృద్ధికి కమిటీ కృషి: కొత్వాల

పాల్వంచ టౌన్, సెప్టెంబర్ 12: హిందు శ్మశానవాటిక అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు స్వర్గధామం కమిటి కృషి చేస్తుందని కమిటి గౌరవ అధ్యక్షుడు, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. కమిటి అధ్యక్షుడు సామినేని కోటేశ్వరరావు అధ్యక్షతన గురువారం కమిటి సమావేశం జరిగింది. స్వర్గధామం అభివృద్ధి మార్గాలపై విస్తృతంగా చర్చించి ఏకగ్రీవంగా తీర్మానాలను ఆమోదించారు. కొత్వాల మాట్లాడారు. స్వర్గధామానికి అనుసందానంగా భవనాన్ని నిర్మించేందుకు స్థలాన్ని ఇచ్చిన స్థలదాత కాపర్తి వెంకటాచారి స్థలం డాక్యుమెంట్స్‌ను కమిటి వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి బత్తుల వెంకటేశ్వరరావు, చావా జగన్ మోహన్‌రావు, కోశాధికారి శ్రీనివాసరావు, కొండం వెంకన్న, ఎస్. శివ ప్రసాద్, శనగ రాంచందర్‌రావు, ఎస్. జనార్ధన్‌రెడ్డి, కాపర్తి వెంకటాచారి పాల్గొన్నారు.

### ఉపాధ్యాయుల శ్రేయస్సే పీఆర్‌టీయూ లక్ష్యం

పినపాక, సెప్టెంబరు 12: ఉపాధ్యాయుల శ్రేయస్సే లక్ష్యంగా పీఆర్‌టీయూ పని చేస్తుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు డి. వెంకటేశ్వరరావు తెలిపారు. గురువారం పీఆర్‌టీయూ పినపాక మండల సమావేశం ఏడుళ్ల బయ్యారంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సంక్షేమంతోపాటు హక్కుల సాధన కోసం నిరంతరం పని చేస్తున్నామని వెల్లడించారు. అనంతరం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులు వేల్పుల రవికుమార్, కార్యదర్శిగా కే. శ్రీకాంత్‌లను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి బి. రవి, నాయకులు రాంబాబు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### చట్టాలు ప్రతి ఒక్కరికి అమలు చేయాలి

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, సెప్టెంబరు 12: మున్సిపల్ చట్టాలు పట్టణంలో నివసిస్తున్న ప్రతి ఒక్కరికి అమలు చేయాలి కానీ అధికారులు అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ ఆరోపించారు. గురువారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మున్సిపల్ అధికారులు అవలంబిస్తున్న విధానాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

## సింగభూపాలెం చెరువుకు
# కాంక్రీట్ వాల్ నిర్మాణానికి చర్యలు

- కుంగిన చెరువు కట్టకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశం
- రెండు ప్రభుత్వాల నుంచి నిధుల సేకరణ చేస్తాం
- చెరువును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం
- ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి


చెరువును పరిశీలిస్తున్న ఎంపీ రఘురాంరెడ్డి

సుజాతనగర్, సెప్టెంబరు 12 : సుజాతనగర్ మండలానకు మణిహారం లాంటి సింగభూపాలెం చెరువు కరకట్ట కుంగడంతో ప్రమాదభరితంగా మారింది. దీనితో సింగభూపాలెం చెరువు కట్ట పరిస్థితిని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి గురువారం పరిశీలించారు. కరకట్ట పరిస్థితి కుంగుబాటుకు గురవుతున్నందున తక్షణ చర్యలు తీసుకోవాలని పలు పార్టీల నాయకులు, రైతులు ఎంపీకి విన్నవించారు. స్పందించిన ఎంపీ మాట్లాడుతూ ఈ ప్రాంత రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఇప్పుడు కానీ భవిష్యత్తులో గానీ రాకుండా చూస్తానని అన్నారు. కుంగిన చెరువు కట్టకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. సింగభూపాలెం చెరువుకు కాంక్రీట్ వాల్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి నిధుల సేకరణ చేస్తామన్నారు. చెరువును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దటానికి కృషి చేస్తానని అన్నారు. 'ప్రమాద పుటంచున సింగభూపాలెం' అనే కథనం ఈనెల 9న ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైంది. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు నాగా సీతారాములు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చింతలపూడి రాజశేఖర్, సొసైటీ ఛైర్మన్ మండే వీర హనుమంతరావు, డీఎస్పీ రెహమాన్, షేక్ అబీద్, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీలలో పలు గ్రామాల ప్రజలు ఎరువుల కోసం, అత్యవసర పరిస్థితుల్లో అనేక ఇబ్బందులు పడుతున్నారని అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని కోరారు.

### సాయి కుటుంబానికి ఆర్థిక సహాయం

పాల్వంచ రూరల్: మండలంలోని ముంపు గ్రామాలను ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి గురువారం పర్యటించారు. కిన్నెరసాని ప్రవాహం ముంపు ప్రాంతంలోని దంతెలబోరు, గంగదేవిగుప్ప గ్రామాలను సందర్శించారు. ఇటీవల కిన్నెరసాని ప్రవాహంలో గల్లంతై ఆచూకీ దొరకని జారె సాయి కుటుంబసభ్యులను పరామర్శించారు. వారికి రూ.10వేల ఆర్థిక సహాయం అందజేశారు. సాయి కోసం వెతుకులాడాలని అధికారులను ఆదేశించారు. ఈ ప్రాంతంలో జరిగిన పంట నష్టాన్ని అంచనాలు వేయాలని చెప్పారు. దెబ్బతిన్న గృహాలకు ప్రభుత్వపరంగా సహాయం అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొండ వెంకన్న, మాజీ జడ్పీటీసీ చైర్మన్ బరపాటి వాసుదేవరావు, మాజీ జడ్పీటీసీ యర్రంశెట్టి ముత్తయ్య, పీసీసీ సభ్యుడు నాగా సీతారాములు, నాయకులు కిషోర్, ఎస్‌వీకే. ఆచార్యులు, వై.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### ముంపు బాధితులకు కార్యకర్తలు అండగా ఉండాలి

ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల ముంపునకు గురైన బాధితులకు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అండగా ఉండాలని ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి కోరారు. జగన్నాథపురంలో జరిగిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తుందని ఈ మేరకు కార్యకర్తలు గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ ఛైర్మన్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొండ వెంకన్న, మాజీ జడ్పీటీసీ ఛైర్మన్ బరపాటి వాసుదేవరావు, మాజీ జడ్పీటీసీ యర్రంశెట్టి ముత్తయ్య, పీసీసీ సభ్యుడు నాగా సీతారాములు పాల్గొన్నారు.

### పెనగడపలో ఎంపీ రఘురాంరెడ్డి పర్యటన

చుంచుపల్లి: చుంచుపల్లి మండలంలోని పెనగడప పంచాయతీలో ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాంరెడ్డి పర్యటించారు. ఎంపీకి సమస్యలు పరిష్కరించాలని కాంగ్రెస్ మైనార్టీ నాయకులు వినతి పత్రాన్ని గురువారం అందజేశారు. పెనగడప పంచాయతీలో గల మూలుగుగూడెం ఎర్రవాగు ఉధృతంగా ప్రవహిస్తున్న నేపధ్యంలో కొత్త బ్రిడ్జిని నిర్మించాలని ఎంపీని కోరారు. వైకుంఠ దామాలో శ్మశాన వాటిక ప్రహరీ నిర్మించాలని, షెడ్‌లను ఏర్పాటు చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం పట్టణ మైనార్టీ జనరల్ సెక్రటరీ గోరె బాబు, మైనార్టీ కాంగ్రెస్ నాయకులు హలీం, హజ్గర్, మీరా, రహీం, కొండల్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

### సమస్యలపై దరఖాస్తుల స్వీకరణ

దుమ్ముగూడెం సెప్టెంబరు 12: మండలంలోని దబ్బనూతల, కమలాపురం, కొత్తూరు గ్రామాల్లో తహసీల్దార్ అశోక్ కుమార్ గురువారం గ్రామసభలను నిర్వహించారు. ఆదివాసీల భూ సమస్యలపై దరఖాస్తులను స్వీకరించారు. భూ సమస్యలతో బ్యాంకు రుణం, త్రీఫేజ్ విద్యుత్, రైతు బీమా, రైతు భరోసా వంటి పలు సంక్షేమ పథకాలకు దూరమౌతున్నామని రైతులు వివరించారు. వీలైనంత త్వరలో సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వినీల్, రమేష్, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

### ముంపు పంటలను గుర్తిస్తున్నాం: ఏవో

సుజాతనగర్, సెప్టెంబరు 12: సుజాతనగర్ మండలంలో అధిక వర్షాలకు గురై నష్టపోయిన పంట పొలాలను గుర్తిస్తున్నామని మండల వ్యవసాయ అధికారిణి జి.నర్మద అన్నారు. గురువారం మండల పరిధిలోని సింగభూపాలెం చెరువుకు నీరు వచ్చే తోగు వాగు పరిసర ప్రాంత రైతుల పొలాలను డీఏవో నర్సింహారావుతో కలిసి పరిశీలించారు. సింగభూపాలెం చెరువు నిండి, నీటి ఉధృతి ఎక్కువై వాగు వరదగా మారి చుట్టు పక్కల ఉన్న పంటపొలాలలు వరద ముంపునకు గురయ్యాయని తెలిపారు. దీనితో జామ్లా తండా, బేతంపుడి రైతుల పంట పొలాలు ఉన్నాయని, పంట నష్టం అంచనా వేస్తున్నామని తెలిపారు. ఇప్పటి వరకు 50 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీరితో పాటు ఏఈఓ నర్సింహారావు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

### గెజిటెడ్ హోదా కల్పించాలి

భద్రాచలం, సెప్టెంబరు 12: గురుకుల ప్రిన్సిపాల్, జేఎల్స్, డిగ్రీ లెక్చరర్లకు గెజిటెడ్ హోదా కల్పించాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.లివింగ్‌స్టన్ అన్నారు. జిల్లాలోని యుటీఎఫ్ కార్యక్రమంలో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో జిల్లాలోని వివిధ మహాత్మ జ్యోతిరావుపూలే పాఠశాలలు, కళాశాలలను వారు సందర్శించారు.మాట్లాడుతూ గురుకుల ఉపాధ్యాయులకు హెల్త్ కార్డు మంజూరు చేయాలని, పాఠశాలల్లో మార్పు చేయాలని కోరారు. కార్యక్రమంలో రాజు, టి.సునీత, ఎస్.విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

## ఏచూరి మరణం కమ్యూనిస్టు ఉద్యమానికి లోటు

- పలువురి నాయకుల నివాళి



మాట్లాడుతున్న మల్లు లక్ష్మి

కొత్తగూడెం, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): సీపీఎం ఆఖిలభారత కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి మరణం వల్ల దేశం ఒక కమ్యూనిస్టు యోధుడ్ని కోల్పోయిందని భారత కమ్యూనిస్టు ఉద్యమానికి ఏచూరి మరణం తీరని లోటని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యురాలు మల్లు లక్ష్మి అన్నారు. గురువారం మంచికంటి భవన్‌లో ఏచూరి సంతాపసభ జరిగింది. ఏచూరి చిత్రపటానికి ఈపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యురాలు మల్లు లక్ష్మితోపాటు సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, కార్యదర్శివర్గసభ్యులు ఏజే. రమేష్, ఎం. జ్యోతి, లిక్కి. బాలరాజు, జిల్లా కమిటి సభ్యులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా ఏచూరి మృతిపట్ల సంతాపం ప్రకటించారు.

● జూలూరుపాడు: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి కమ్యూనిస్ట్ ఉద్యమాలకు తీరని లోటని సీపీఎం, సీపీఐ, టీడీపీ నాయకులు యాసా నరేష్, గుండెపిన్ని వెంకటేశ్వర్లు అన్నారు. ఆయన మృతి పట్ల గురువారం వారు ప్రకటనలో సంతాపాన్ని తెలియజేశారు.

● ఇల్లెందు టౌన్: సీపీఎం కేంద్ర ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతిపట్ల సీపీఎం నాయకులు సంతాపం ప్రకటించారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో ఏచూరి చిత్రపటానికి నివాళులర్పించారు. జాతీయ ప్రధాన కార్యదర్శిగా సీతారాం ఏచూరి దేశ వ్యాప్తంగా పీడితపాడిత ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఈ సంతాప సభలో మండల కార్యదర్శి అబ్దుల్ నబీ, తాళ్లూరి కృష్ణ, మన్నెం మోహన్‌రావు, ఆలేటి కిరణ్ ఉన్నారు.

● కరకగూడెం: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి పార్టీకి తీరని లోటు అని సీపీఎం మండల కార్యదర్శి కొమరం కాంతారావు అన్నారు.

● అళ్లపల్లి: సీపీఎం మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారం ఏచూరి మరణం కమ్యూనిస్టు పార్టీలకే తీరనిలోటు అని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రేసు ఎల్లయ్య అన్నారు.

### సాయుధపోరాట స్ఫూర్తిని కొనసాగించాలి: సీపీఐ

ఇల్లెందు టౌన్, సెప్టెంబరు 12: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట స్ఫూర్తిని కొనసాగించాలని సీపీఐ రాష్ట్రసమితి సభ్యుడు కే. సారయ్య పిలుపునిచ్చారు. గురువారం 76వ తెలంగాణ సాయుధపోరాట వార్షికోత్సవాల సందర్భంగా స్థానిక కార్యాలయంలో సదస్సు నిర్వహించి మాట్లాడారు. తెలంగాణ సాయుధరైతాంగపోరాటంలో సింగరేణి బొగ్గుగని కార్మికుల పాత్ర ఎంతో కీలకమన్నారు. 132 ఏళ్ల చరిత్రాత్మక సింగరేణి బొగ్గుగని ప్రాంతం దేశాభివృద్ధికి వెలుగులు అందించే బొగ్గును వెలికి తీశారని కొనియాడారు. సమావేశంలో ఏఐటీయూసీ నాయకులు నజీర్ అహ్మద్, దాసరి రాజారాం, దేవరకొండ శంకర్, బందం నాగయ్య, సుందర్, సంజీవచారి, నూనె శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### దెబ్బతిన్న పంటలు పరిశీలించిన శాస్త్రవేత్తలు

మణుగూరు/బూర్గంపాడు, సెప్టెంబరు 12 : మణుగూరు, అశ్వాపురం మండలాలల్లో భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటను గురువారం కేవీకే శాస్త్ర వేత్తల బృందం పరిశీలించింది. డాక్టర్ ఉమారెడ్డి, వి వెంకన్న, ఎస్ ఓం ప్రకాష్, లక్ష్మీనారాయణమ్మ, శ్రీనివాసరావు, శివ, వ్యవసాయ అధికారులు తాతారావు, రవికుమార్, ఎఈవో లక్ష్మన్ రావు తదితరులు పాల్గొన్నారు. దెబ్బతిన్న పంటల రైతులకు పలు సూచనలు చేశారు.

బూర్గంపాడు: భారీ వర్షాలతో మండలంలోని నాగినేనిప్రోలు వద్ద పంట పొలాలను అసోసియేట్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ ఉమారెడ్డి, జిల్లా కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ నారాయణమ్మ, మణుగూరు డివిజన్ ఏడీఏ తాతారావు పరిశీలించారు. నష్టపోయిన పంట వివరాలను ఉన్నత అధికారులకు నివేధిక పంపిస్తామన్నారు.కార్యక్రమంలో ఏవో శంకర్, ఏఈవోలు శృతి, ప్రసాద్, వైష్ణవి, ఆత్మ సిబ్బంది పవన్ కుమార్, రైతులు పాల్గొన్నారు.

### వరద బాధితులకు లయన్స్ క్లబ్ ఇంటర్ నేషనల్ సాయం

మణుగూరు, సెప్టెంబరు12: మణుగూరు పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఉన్న నిరుపేద వరద బాధిత కుటుంబాలకు లయన్స్ క్లబ్ ఆఫ్ ఇంటర్నేషనల్ నిత్యావసరాలు పంపిణీ చేశారు. గురువారం మణుగూరు ప్రభుత్వ కాలేజీలో ఏర్పాటు చేసిన ఈ వితరణ కార్యక్రమానికి లయన్స్ క్లబ్ ఇంటర్‌నేషనల్ జిల్లా గవర్నర్ 320ఈవై ప్రభాకర్ రెడ్డి ముఖ్య అతిధిగా పాల్గొని బాధితులకు నిత్యావసరాలు 200 కుటుంబాలకు ఈ వితరణ అందజేశారు. కార్యక్రమంలో పి గోపాల్ రెడ్డి, ఎ కోటేశ్వరరావు, బాలయ్య, కె మురళికృష్ణ, సీహెచ్ వి శివప్రసాద్, టి మోహన్ రావు, సోమిరెడ్డి, కేవిపి ప్రసాద్, శివశంకర్, వెంకటరెడ్డి, వసుందర దేవి, సత్యప్రకాష్, గాజుల రమేష్‌కుమార్, దుస్సా సమ్మయ్య, చంద్రమోహన్, నాగేశ్వరరావు, పూర్ణచందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

### ఆసుపత్రి కార్మికుల పెండింగ్ వేతనాలు ఇవ్వాలి

మణుగూరు, సెప్టెంబర్ 12 : మణుగూరులోని ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేసే కాంట్రాక్టు కార్మికుల పెండింగ్ వేతనాలు పిఎఫ్, ఈఎస్‌ఐ తదితర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఇఫ్టూ అధ్వర్యంలో సిబ్బంది గురువారం కలెక్టర్ జితేష్‌పాటిల్ కు వినతి పత్రాన్ని అందించారు. ఇఫ్టూ నాయకులు ఆర్ మధుసూధన్ రెడ్డి, నాయకులు యాకూబ్ షావలి, పాయం వెంకన్న, సతీష్, జీ రమేష్ తదతరులు పాల్గొన్నారు.

### ఐద్వా మండల కమిటీ ఎన్నిక

అశ్వారావుపేట రూరల్, సెప్టెంబరు 12: ఐద్వా మండల అధ్యక్ష కార్యదర్శులుగా మడకం సత్యావతి, తగరం నిర్మల ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలంలోని నందిపాడు గ్రామంలో గురువారం ఐద్వా మండల 4వ మహాసభను నిర్వహించారు. మడకం సత్యావతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా కార్యదర్శి మందలపు జ్యోతి మాట్లాడారు. జిల్లా కార్యదర్శి పర్యవేక్షణలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ ఉపాధ్యక్షులుగా మనుగొండ సత్యావతి, సహాయ కార్యదర్శులుగా మొడియం తిరుపతమ్మ, మంగతో పాటు మరికొంత మందితో కమిటీని ఎన్నుకున్నారు. సమావేశంలో మహిళలు పాల్గొన్నారు.

## కృత్రిమ అవయవ దాత ఇక లేరు

● అనారోగ్యంతో డాక్టర్ విజేందర్‌రావు కన్నుమూత


విజేందర్‌రావు (ఫైల్)

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, సెప్టెంబరు 12: కృత్రిమ అవయవ దాత, కొత్తగూడెం పట్టణ ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ విజేందర్‌రావు(71) తీవ్ర అనారోగ్యంతో మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో చికిత్స పొందుతున్న విజేందర్‌రావు మృతి చెందడం భద్రాద్రి జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆయన అభిమానులు, సాయం పొందిన వారు, వైద్యులు, రోటరీ క్లబ్ సభ్యులు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. వైద్య రంగానికి విజేందర్ రావు మృతి తీరని లోటని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ఆయన పార్థీవ దేహానికి పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించి ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఎంతో మందికి ఉచితంగా కృత్రిమ అవయవాలను అందజేశారన్నారు. అదేవిధంగా విద్యావేత్తగా సైతం ఫార్మసీ విద్యను భద్రాద్రి జిల్లాలో అందించారని అన్నారు. విజేందర్‌రావు మృతి పట్ల కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షులు లక్కినేని సత్యనారాయణ ఆధ్వర్యంలో సంతాప సభను నిర్వహించారు. అదేవిధంగా ప్రకృతి ప్రేమికుడిగా రోటరీ క్లబ్ గవర్నర్‌గా డాక్టర్ విజేందర్‌రావు అందించిన సేవలు వెలకట్టలేనివని రోటరీ క్లబ్ ఉపధ్యక్షులు ఎంఎస్ఆర్ రవిచంద్ర అన్నారు. సంతాపం ప్రకటించిన వారిలో దూదిపాల రవికుమార్, ప్రవీణ్‌కుమార్, సాబీర్‌పాషా, ప్రతిభ, గోరంట్ల సుగుణారావు, డాక్టర్ బి.కృష్ణయ్య, మద్దెల శివకుమార్, తదితరులు ఉన్నారు.

### భారీ వర్షాలకు బయ్యారంలో కూలిన ఇల్లు

పినపాక, సెప్టెంబరు 12: పినపాక మండలం బయ్యారం పంచాయతీలో గల పోతిరెడ్డిపల్లి గ్రామంలో గాదే తాతారావు నివాసం ఉంటున్న ఇల్లు ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా కూలిపోయింది. బాధితులకు నిలువ నీడలేక ఇబ్బంది పడుతూ, కట్టుబట్టలతో రోడ్డున పడ్డారు. ఘటనపై సంబంధిత అధికారులు స్పందించి బాధిత కుటుంబానికి ఆశ్రయం కల్పించి న్యాయం చేయాలని వేడుకున్నారు.ఈ విషయం తెలుసుకున్న రెవెన్యూశాఖ ఆర్ఐ కే. బాలకృష్ణ పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. ఇల్లు మంజూరు చేసి తనకు గూడు కల్పించాలని బాధిత కుటుంబం వేడుకుంది.

### పెద్దవాగు బ్రిడ్జి మరమ్మతులు చేపట్టాలి: టీడీపీ


బ్రిడ్జి రహదారి అడ్డుగా పెట్టిన ట్రాక్టర్

కరకగూడెం, సెప్టెంబరు 12: ఇటీవల కురిసిన వర్షాలకు కోతకు గురైన పెద్దవాగు బ్రిడ్జి వద్ద రహదారిని తక్షణమే మరమ్మతులు చేపట్టాలని టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర నాయకులు చందా మధు డిమాండ్ చేశారు. గురువారం బ్రిడ్జి రహదారిని పరిశీలించిన ఆయన మాట్లాడుతూ.. బ్రిడ్జి వద్ద రహదారి ప్రమాదకరంగా ఉండటంతో కలెక్టర్ స్పందించి రూ.9.80లక్షలతో మరమ్మతులు చేపట్టిన ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మరల కోతకు గురైందని అధికారులు అరకొరగా పనులు చేసి వదిలేశారన్నారు. బ్రిడ్జి ప్రమాదకరంగా ఉండటంతో పంచాయతీ అధికారులు ట్రాక్టర్‌ను రహదారికి అడ్డుగా పెట్టి రోజులు గడుస్తున్నాయని.. ఈ రహదారి ప్రమాదకరంగా ఉండటంతో వట్టంవారిగుంపు, చిరుమళ్ళ పంచాయితీలలో పలు గ్రామాల ప్రజలు ఎరువుల కోసం, అత్యవసర పరిస్థితుల్లో అనేక ఇబ్బందులు పడుతున్నారని తక్షణమే అధికారులు స్పందించి మరమ్మత్తులు చేపట్టాలని తెలిపారు.

## విద్యుత్ సబ్‌స్టేషన్లకు రూ.5.63కోట్లు మంజూరు



పాల్వంచ రూరల్, సెప్టెంబర్ 12: ప్రజలకు విద్యుత్ అంతరాయం తలెత్తకుండ చూసేందుకు పాల్వంచ మండలంలోని పాండురంగాపురం, శ్రీనివాసకాలనీల్లో రెండు సబ్‌స్టేషన్ల ఏర్పాట్లకు నిధులు మంజూరు అయ్యాయని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు గురువారం తెలిపారు. పాండురంగాపురంలో రూ.3.43కోట్ల నిధులతో 33/11కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఈ సబ్‌స్టేషన్ వల్ల పాండురంగాపురం, నర్సంపేట, ప్రభాత్‌నగర్, ఇల్లెందులపాడు గ్రామాలకు విద్యుత్ సరఫరాకు ఇబ్బంది లేకుండ ఉంటుందన్నారు. శ్రీనివాసకాలనీలో నాలుగు11 కేవీ ఫీడర్లతో సబ్‌స్టేషన్ నిర్మించనున్నట్లు తెలిపారు. దీని వల్ల వెంకటేశ్వర హీల్స్‌కాలనీ, శ్రీనివాసకాలనీ, అయ్యప్పనగర్, పేటచెరువు ఏరియాలకు మెరుగైన విద్యుత్ సరఫరా అవుతుందన్నారు. ఈ సబ్‌స్టేషన్‌కు రూ.2.19కోట్లు నిధులు కేటాయించారన్నారు.

### వరద బాధితులకు రూ. 15.18లక్షల సహాయం

పాల్వంచ రూరల్, సెప్టెంబర్ 12: పాల్వంచలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన కుటుంబసభ్యులకు ప్రభుత్వం నుంచి తక్షణ ప్రభుత్వ సహాయంగా రూ. 15.18లక్షలు కేటాయించినట్లు ఎమ్మెల్యే చెప్పారు. 92మంది వరదబాధిత కుటుంబానికి రూ. 16,500చొప్పున నష్ట పరిహారం అందించడం జరుగుతుందన్నారు.

### ఎయిడ్స్‌పై అవగాహన

దుమ్ముగూడెం సెప్టెంబరు 12: నరసాపురం జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల విద్యార్థులకు వైద్యశాఖ ఆధ్వర్యంలో గురువారం ఎయిడ్స్, కౌమార విద్యలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కౌమార దశలో కలిగే మార్పులు, వ్యక్తిగత పరిశుభ్రత, ఎయిడ్స్ వ్యాధి సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. నరసాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి సుభాష్, హెచ్‌ఎం శ్రీనివాసరావు, నోడల్ అధికారి రామారావు, టీచర్లు వైద్యసిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## వచ్చే సీజన్ నాటికి అలుగు నిర్మాణం పూర్తి చేస్తాం: ఎమ్మెల్యే జారే


గండి పడిన ప్రదేశంలో సీఈతో మాట్లాడుత్ను ఎమ్మెల్యే

చంద్రుగొండ. సెప్టెంబరు 12: వచ్చే సంవత్సరం వ్యవసాయ సీజన్ నాటికి అలుగును పూర్తి స్థాయిలో పునరుద్దరించి, రైతులకు సాగు నీటి ఇబ్బందులు లేకుండా చేస్తామని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ తెలిపారు. వెంగళరావుసాగర్ కుడికాలువకు పడిన గండిని గురువారం ఎమ్మెల్యే జారే ఆదినారాయణ నీటి పారుదల సీఈ శ్రీనివాసరెడ్డితో కలిసి గండిని యంత్రాలతో పూడుస్తున్న పనులను పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నీటి పారుదల అధికారులు వేగవంతంగా చర్యల కారణంగా 24 గంటల్లోనే గండిని పూడ్చే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఏడెనిమిది గ్రామాలకు జీవనాధారమైన ప్రాజెక్టు పరిరక్షిస్తామని, ఇప్పటికే ఉన్న రూ.33 కోట్ల ప్రతి పాదనలకు నిధుల విడదల చేయిస్తానని తెలిపారు. అనంతరం సీఈ మాట్లాడుతూ నిధులు విడదల అయితే వర్షాలు ముగిన వెంటనే పనులు ప్రారంభించటానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఈఈ అర్జున్, డీఈ క్రిష్ణ శంకర్, ఏఈ నరసింహరావు గండి ప్రదేశంలోఉండి పనులు పర్యేక్షిస్తున్నారు.

## క్రీడల్లో సత్తాచాటాలి: ఎంపీడీవో


కబడ్డి ఆడుతున్న విద్యార్థులు

జూలూరుపాడు, సెప్టెంబరు 12: విద్యార్థులు చదువుకే పరిమితం కాకుండా క్రీడల్లో ప్రతిభను కనబరిచి సత్తా చాటాలని ఎంపీడీవో కరుణాకర్‌రెడ్డి, జూలూరుపాడు సీఐ ఇంద్రసేనారెడ్డి అన్నారు. జూలూరుపాడు ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన మండల స్థాయి పాఠశాలల క్రీడా పోటీలను గురువారం జ్యోతి ప్రజ్వలను చేసి వారు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ క్రీడాలు శారీరక, మానసిక ఉల్లాసానికి ఎంతోగానో దోహదపడతాయన్నారు. ఎంఈవో వెంకట్ మాట్లాడుతూ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులనే జోనల్ స్థాయి పోటీలకు ఎంపిన చేయ్యాలని తెలిపారు. అండర్-14, అండర్-17 విభాగాలలో బాలురకు కబడ్డీ, వాలీబాల్, ఖోఖో తదితర పోటీలను నిర్వహించారు. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఉత్సహంగా ఈ పోటీలలో పాల్గొన్నారు. సీనియర్స్ విభాగంలో కబడ్డీలో వెంగన్నపాలెం సెయింట్ ఆంథోని ప్రథమ, జడ్పీఎస్ఎస్ పీఎస్‌పురం ద్వితీయ, జూనియర్స్ విభాగంలో జడ్పీఎస్ఎస్ జూలూరుపాడు ప్రథమ, కాకర్ల ద్వితీయ స్థానంలో నిలిచాయి. వాలీబాల్ పోటీల్లో సీనియర్స్ విభాగంలో జూలూరుపాడు ప్రథమ, కాకర్ల ద్వితీయ, జూనియర్స్‌లో జూలూరుపాడు, కాకర్ల పాఠశాలలు ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించాయి. ఖోఖోలో జూనియర్స్, సీనియర్స్ విభాగాలలో జూలూరుపాడు ప్రథమ, పాపకొల్లు ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. ఈ కార్యక్రమంలో క్రీడల కన్వీనర్ లక్ష్మీనరసయ్య, ఎంపీవో తులసీరాం, ఆర్యవైశ్య సంఘం జిల్లా నాయకులు పెండ్యాల ప్రసాదరావు, హెచ్‌ఎంలు ఎస్‌కె మీరా, సంజీవరావు, వ్యాయామ ఉపాధ్యాయులు పద్మావతి, ఉపేందర్, జి. నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిపై దాడి తగదు

జూలూరుపాడు, సెప్టెంబరు 12: బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశికొరెడ్డిపై దాడి చేయటం తగదని బీఆర్ఎస్ జిల్లా అధికారి ప్రతినిధి లకావత్ గిరిబాబు అన్నారు. గురువారం జూలూరుపాడు ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కౌశికొరెడ్డిని పోలీసులతో ఇంట్లోనే నిర్బంధించటం దుర్మర్గమైన చర్యని అతనిపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు.

### రహదారులకు మరమ్మతులు చేపట్టండి


● తుమ్మలను కలిసిన ఎమ్మెల్యే జారే

దమ్మపేట, సెప్టెంబరు 12: గోతులమయంగా మారిన రహదారులను మరమ్మతులు చేయించాలని ఎమ్మెల్యే జారే ఆదినారాయణకు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. మంత్రి తుమ్మలను ఎమ్మెల్యే జారే ఆయన నివాసంలో గురువారం కలిశారు. తుమ్మల మాట్లాడుతూ అశ్వారావుపేట నియోజకవర్గంలో వర్షాల వల్ల దెబ్బతిన్న రహదారులు, గోతులు లేకుండా మరమ్మతులు చేయించాలని సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలన్నారు. దమ్మపేట, అశ్వారావుపేట, సత్తుపల్లి, వేంసూరు, కల్లూరు, తల్లాడ, పెనుబల్లి తదితర మండలాల నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు తుమ్మల కలిశారు. ఆయా మండలాల్లో వున్న ప్రధాన సమస్యలు తుమ్మల దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి కలిసిన వారిలో కొయ్యల అచ్యుతరావు, దొడ్డా ప్రసాద్, కోటగిరి బుజ్జిబాబు, మన్నెం అప్పారావు, కాసాని నాగప్రసాద్, ఎర్రా వసంతరావు తదితరులున్నారు.


నాయకులతో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

## గత పాలకుల నిర్లక్ష్యం వల్లే నష్టం ఎక్కువ

- ఎమ్మెల్యే పాయం
- 2000 కుటుంబాలకు రూ. 16500 చొప్పన ఆర్థిక సాయం
- ఇళ్లుకూలిన వారికి ఇందిరమ్మ ఇళ్లు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయం

మణుగూరు, సెప్టెంబరు 12: ప్రకృతి వైపరీత్యాల వల్ల సంబవంచిన నష్టం కొంతైతే గత పాలకుల ప్రభుత్వ నిర్లక్ష్యం .. అనవసర కట్టడాలు వెరసి మణుగూరు ముంపునకు కారణమైయ్యాయని పినపాక ఎమ్మెల్యే పాయం ఆరోపించారు గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి బాధిత కుటుంబాలను సీఎం రేవంత్ రెడ్డి సారధ్యంలో ఆదుకున్న తీరును వివరించారు. నియోజకవర్గ వ్యాప్తంగా రెండువేలముప్పై కుటుంబాలకు కుటుంబానికి రూ.16,500 చొప్పున ఆర్థిక సాయాన్ని చెక్కుల రూపంలో ప్రభుత్వం అందించిందన్నారు. నియోజకవర్గంలో అళ్లపల్లి ఒక్కటి, అశ్వాపురం 202 కుటుంబాలు, మణుగూరులో 1817, బూర్గంపాడులో 8 కుటుంబాలు పినపాకలో రెండు కుటుంబాలు నష్టం జరిగిందన్నారు. ఇంతటి తక్షణ సాయాన్ని అందించిన ఘనత కేవలం కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. ఇళ్ల కూలిపోయిన వారికి ఫస్ట్ ఫేజ్‌లో ఇందిరమ్మ ఇళ్ల మంజూరి చేస్తామని తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా లబ్ధి దారులందరికీ బ్యాంకు ఖాతాలో ఈ నగదు జమ అవుతుందన్నారు. ప్రాణ నష్టం జరిగిన వారికి మరుసటి రోజే మూడు కుటుంబాలకు రూ.5 లక్షల రూపాయాలను కాంగ్రెస్ ప్రభుత్వం అందించిందన్నారు. వరదల సమయంలో రెవెన్యూ పోలీసుశాఖల అధికారులు పనిచేసిన తీరు అభినందనీయమన్నారు. కట్టువాగు, కోడిపుంజుల వాగులపై పలు చోట్ల చెక్ డ్యాంలు రైతులకు ఉపయోగం లేకపోయినాకట్టారన్నారు. దీంతో వరదలు ఎక్కడిక్కడ పొంగి పోర్లి జనావాసాల పై ప్రవాహాలు ముంపుకు గురి చేశాయన్నారు. అంతే కాకుండా సింగరేణి అధికారుల వైఖరి కూడా కొంత కారణమైందన్నారు. కట్టువాగు, కోడిపుంజుల వాగు, సింగరేణి ప్రాంతంలోని లోతు వాగులపై ఇరిగేషన్ అధికారులతో పాటు రెవెన్యూ, సింగరేణి అధికారులతో త్వరలో సమీక్ష సమావేశాన్ని నిర్వహించి పటిష్టమైన చర్యలను తీసుకుంటామన్నారు. రైతుల నష్టపోయిన పంటలకు సంబంధించి సర్వేలు జరుగుతున్నాయన్నారు. వారికి కూడా ఎకరానికి రూ 10 వేల నష్టపరిహారం ప్రభుత్వం నుంచి అందుతుందన్నారు. బాధితులను ఆదుకున్న స్వచ్ఛంద సంస్థలకు పలు పార్టీల నాయకులకు, మానవతా దృక్పధంతో స్పందించిన ప్రతిఒక్కరికి దన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

### వరద బాధితులకు ప్రభుత్వ సాయం

మణుగూరు వరద బాధితులకు ప్రభుత్వం నుంచి వచ్చిన ఆర్థిక సహాయాన్ని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు గురువారం అందజేశారు. ముంపు ప్రాంతాలైన సుందరయ్య నగర్, ఆదర్శనగర్, మామిడి తోట గుంపు, తదితర ప్రాంతాల్లో ఎమ్మెల్యే స్వయంగా అధికారులతో వెళ్లి బాధిత కుటుంబాలకు నేరుగా చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాఘవ రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఎంపీవో వెంకటేశ్వర్లు, మణుగూరుమునిసిపల్ కమీషనర్ ఉమామహే శ్వరరావు, కాంగ్రెస్ నాయకులు పి నవీన్, కూచిపూడిబాబు, పాతూరి వెంకన్న, దొడ్డపినేని మధు, సామా శ్రీనివాసరెడ్డి, మాదాడి రాజేష్, మానస, ఆదిలక్ష్మి, చింతల కృష్ణ, గాండ్ల సురేష్, బెల్లం సురేష్, లక్ష్మీనారాయణ, తూపూడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.